ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

పెద్దపల్లి జిల్లా వార్తలు

5★ బుధవారం 10 జూలై 2024



ఎన్నికల హామీలు అమలుచేయాలని బీజేపీ ఆందోళనలు 8లో..

గౌరీగుండాల జలపాతాన్ని పిక్నిక్ స్పాట్‌గా తీర్చిదిద్దుతాం 8లో..



ఆర్‌అండ్‌బీలో సిబ్బంది కొరత

ముగ్గురు డీఈలకు ఒక్కరే..

- 11 ఏఈ, ఏఈఈ పోస్టులకు ముగ్గురే విధుల్లో..
- పర్యవేక్షణ లేక పనుల్లో కొరవడుతున్న నాణ్యత

(ఆంధ్రజ్యోతి, పెద్దపల్లి)

జిల్లాలోని రోడ్లు, భవనాల శాఖ సిబ్బంది కొరతతో కొట్టుమిట్టాడుతున్నది. కోట్ల రూపాయల విలువైన రోడ్ల నిర్మాణాలు, భవన నిర్మాణ పనులు జరుగుతుండగా, ఆ పనుల పర్యవేక్షణకు సంబంధిత ఇంజనీరింగ్ అధికారుల పోస్టులు ఖాళీగా ఉండడంతో పనుల్లో నాణ్యత లోపిస్తున్నది. ఉన్న ముగ్గురు ఏఈల్లో ఒకరిని ఇటీవల కలెక్టర్ సస్పెండ్ చేశారు. జిల్లాలోని ఆర్‌అండ్‌బీ శాఖ పరిధిలో 858.189 కిలోమీటర్ల రహదారులు ఉన్నాయి. ఈ రహదారుల నిర్మాణం, మరమ్మతులు, పర్యవేక్షణ అంతా క్షేత్ర స్థాయిలో ఇంజినీరింగ్ అధికారులు చేయాల్సి ఉంటుంది. ప్రస్తుతం జిల్లాలో కోట్ల రూపాయల పనులు జరుగు తున్నాయి. రామగుండంలో సుమారు 500 కోట్ల రూపాయలతో మెడి కల్ కళాశాల భవనాల పనులు, పెద్దపల్లి నుంచి కూనారం వెళ్లే రహదారిలో 112 కోట్ల రూపాయలతో అండర్ రైల్వే బ్రిడ్జి, వివిధ వాగులపై వెంతన నిర్మాణాలు, డబుల్ రోడ్లు, సింగిల్ బీటీ రోడ్ల నిర్మాణాలు జరుగుతున్నాయి. దెబ్బతిన్న రహదారులకు సైతం మరమ్మతు పనులు చేయాల్సి ఉంటుంది. ఆర్‌అండ్‌బీ శాఖకు చెందిన పనులే గాకుండా పంచాయతీరాజ్ శాఖ పర్యవేక్షణలో జరగాల్సిన పనులను సైతం అప్పుడప్పుడు ఆర్‌అండ్‌బీ అధికారులకు అప్పగిస్తుం టారు. ప్రభుత్వ పాఠశాలల మరమ్మతు పనులను కూడా ఆర్‌అండ్‌బీకి అప్పగించారు. వారం రోజుల క్రితం జిల్లాకు కొత్తగా వచ్చిన కలెక్టర్ కోయ శ్రీహర్ష రామగుండంలోని పలు ప్రభుత్వ పాఠశాలలను సందర్శించి మరమ్మతు పనుల గురించి అమ్మ ఆదర్శ కమిటీల సభ్యుల ద్వారా తెలుసుకున్నారు. పనుల్లో జాప్యం జరుగుతున్నదని, దీనికి కారణంగా ఆ పనులను పర్యవేక్షిస్తున్న మంథని సబ్ డిజవిన్ ఏఈ జావిద్ పాషాను కలెక్టర్ విధుల నుంచి సస్పెండ్ చేశారు.

● పనుల్లో లోపిస్తున్న నాణ్యత..

జిల్లా కేంద్రంలో ఈఈ ఆఫీస్‌తో పాటు, పెద్దపల్లి భవనాల డివిజన్ కార్యాలయం, పెద్దపల్లి, మంథని, సుల్తానాబాద్ సబ్ డివిజన్లు ఉన్నాయి. ఈ కార్యాలయాల్లో 45 సాంక్షన్ పోస్టులు ఉండగా, 26 మంది పని చేస్తున్నారు. 19 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఒక్కో సబ్ డివిజన్‌కు డిప్యూటీ ఇంజనీర్ ఉండాలి. కానీ కేవలం మంథని డివిజన్‌కు మాత్రమే డీఈ ఉన్నారు. ఆయనకు పెద్దపల్లి, సుల్తానాబాద్ సబ్‌డివిజన్‌ల అదనపు బాధ్యతలు అప్పగించారు. 11 ఏఈఈ, ఏఈ పోస్టుల్లో ముగ్గురు మాత్రమే ఉన్నారు. ఒకరు ఈఈ కార్యాలయంలో, ఒకరు పెద్దపల్లి డివిజన్‌లో, మరొకరు మంథని డివిజన్‌లో మొత్తం ముగ్గురు పని చేస్తున్నారు. ఇందులో మంథని ఏఈ సస్పెండ్ కావడం గమనార్హం. ఉన్న అధికారులపై పని ఒత్తిడి తీవ్రంగా ఉంది. జరుగుతున్న పనులపై సరైన పర్యవేక్షణ లేకపోవడంతో పనుల్లో నాణ్యత లోపిస్తున్నది. సకాలంలో పూర్తికావాల్సిన పనులు జాప్యంగా జరుగుతున్నాయి. కొత్త పనులకు అంచనాలు రూపొందించడానికి సమయం సరిపోవడం లేదని అధికారులు చెబుతున్నారు. సకాలంలో బిల్లులు కూడా రాక కాంట్రాక్టర్లు ఇబ్బందులు పడుతున్నారు. కొంత కాలంగా ఆర్‌అండ్‌బీని సిబ్బంది కొరత వెంటాడుతున్నది. పదవీ విరమణతో ఖాళీ అవుతున్న పోస్టులను భర్తీ చేయకపోవడంతో శాఖాపరంగా ఉన్నవాళ్లు ఇబ్బందులు పడుతున్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి జిల్లాలో ఖాళీగా ఉన్న డిప్యూటీ ఇంజినీర్లు, అసిస్టెంట్ ఇంజినీర్లు, ఏఈఈల పోస్టులను భర్తీ చేయాల్సిన అవసరం ఎంతైనా ఉన్నది.

నిర్వాసితులకు ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీని ఇవ్వండి

- కలెక్టర్‌ను కోరిన ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్



కలెక్టర్‌తో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్

గోదావరిఖని, జూలై 9: సింగరేణి ప్రభావిత, ముంపు గ్రామాల నిర్వాసితులకు ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీని త్వరగా ఇప్పించాలని కలెక్టర్ కోయ శ్రీహర్షను రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్ కోరారు. మంగళవారం కలెక్టర్‌తో ప్రత్యేకంగా సమావేశమై పలు సమస్యలను విన్నవించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వ పాలకుల నిర్లక్ష్యం వల్ల సింగరేణి ప్రభావిత ప్రాంతాలకు అందాల్సిన ప్యాకేజీ అందలేదని, ఏళ్ల తరబడిగా నిర్వాసితులకు రావాల్సిన డబ్బులు ఇవ్వకపోవడంతో నిర్వాసితులు కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారని, ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీని వీలైనంత త్వరగా ఇప్పించాలని కోరారు. నిర్వాసితులు ప్రాజెక్టు కోసం తమ భూములను త్యాగం చేశారన్నారు. ప్రభుత్వ భూములను లొంగిపోయి జనజీవన స్రవంతిలో కలిసిన మాజీ నక్సలైట్లకు కేటాయించాలని విజ్ఞప్తి చేశారు. దీనిపై సానుకూలంగా స్పందించిన కలెక్టర్ ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీని వీలైనంత త్వరలో అందించేందుకు చర్యలు చేపడుతామని చెప్పారు.

ప్రభుత్వ ఆసుపత్రిలో ఘటన దురదృష్టకరం : ఎమెల్యే

పెద్దపల్లి, జూలై 9 (ఆంధ్రజ్యోతి) : జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో సెప్టిక్ ట్యాంక్‌లో బాలుడు విలియమ్స్ పడి గాయాల పాలైన సంఘటన దురదృష్టకరమని పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మెరుగైన చికిత్స కోసం కరీంనగర్‌లోని స్టార్ చిల్డ్రన్స్ ఆసుపత్రిలో చేర్పించగా పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణరావు వెళ్లి చిన్నారి ఆరోగ్య పరిస్థితిని వైద్యులను అడిగి తెలుసుకున్నారు. ఆసుపత్రిలో జరిగిన ప్రమాదానికి పలు కారణాలు తెలుసుకోని అలాంటి ప్రమాదాలు పునరావృతం కాకుండా చూసుకుంటామని, చిన్నారి చికిత్సకు ఖర్చులన్నీ ప్రభుత్వమే భరిస్తుందని కుటుంబ సభ్యులకు భరోసా కల్పించారు. అనంతరం బాధిత కుటుంబ సభ్యులకు మనోధైర్యం కల్పిస్తూ రూ.10 వేలు సహాయం అందించారు.

రామగుండంలో ప్రబలుతున్న జ్వరాలు



జ్వరపీడితులతో నిండిపోయిన గోదావరిఖని ప్రభుత్వాసుపత్రిలోని బెడ్లు

కళ్యాణ్‌నగర్, జూలై 9: వాతావరణంలో మార్పులు, వారం రోజులుగా అడపాదడపా కురుస్తున్న వర్షాలతో రోగాలు ప్రబలుతున్నాయి. గోదావరిఖని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో మంగళవారం రోగులతో కిక్కిరిసింది. ఉదయం వేడి, ఉక్కపోతతో, సాయంత్రం ఓ మోస్తరు వర్షంతో వాతావరణంలో వచ్చిన మార్పులతో ప్రజలు జ్వరాల భారిన పడుతున్నారు. ఆసుపత్రిలో మలేరియా, టైఫాయిడ్ జ్వరాల బాధపడుతూ రోజుకు వంద నుంచి 200మంది వైద్యం కోసం వస్తున్నారు. వర్షంతో చాలా చోట్ల నీరు నిలిచి దోమలు వ్యాప్తిచెందుతున్నాయి. వీటితోపాటు ఈగలు కూడా వృద్ధి చెందుతున్నాయి. కార్పొరేషన్ అధికారులు నీరు నిల్వ ఉన్న చోట ఆయిల్‌బాల్స్ వేయాల్సి ఉంది. ఆయిల్ బాల్స్‌ను, దోమల మందును పచికారి చేయకపోవడంతో దోమల వ్యాప్తి పెరిగింది. వీటితో పాటు విషపురుగులు కూడా సంచరిస్తున్నాయి. సప్తగిరి కాలనీకి చెందిన ఓ వ్యక్తికి విష పురుగు కుట్టి గోదావరిఖని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో 80పడకలు విషజ్వరాలతో రోగులతో నిండిపోయాయి. పలు చోట్ల కాలువలు శుభ్రపర్చకపోవడంతో మురుగునీరు పేరుకుపోయి ఈగలు, దోమలు పెరిగి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.

మొక్కలు నాటి సంరక్షించాలి

- ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్

ధర్మారం, జూలై 9: గ్రామాల్లో ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించుకోవాలని ప్రభుత్వ విప్, ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ అన్నారు. మంగళవారం మండలంలోని బంజేరుపల్లి, కొత్తపల్లి గ్రామాల్లో జరిగిన వన మహోత్సవ కార్యక్రమంలో పాల్గొని మొక్కలు నాటారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలోని ప్రధాన ప్రదేశాల్లో మొక్కలు నాటాలని చెప్పారు. నాటిన మొక్కలను సంరక్షించే బాధ్యతలను తీసుకోవాలని ఆయన తెలిపారు. అనంతరం నూతనంగా ప్రకటించిన పాలకవర్గాన్ని అభినందించారు. మండల ప్రత్యేక అధికారి ప్రేమ్ కుమార్, తహసీల్దార్ రజిత, ఎంపీడీవో ప్రవీణ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ స్తంభాల తొలగింపు

కోల్‌సిటీ, జూలై 9: గోదావరిఖన లేబర్ కోర్టు వద్ద రహదారికి అడ్డంగా ఉన్న విద్యుత్ స్తంభాలను మంగళవారం సింగరేణి, రామగుండం మున్సిపల్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో తొలగించారు. లేబర్ కోర్టు వద్ద 20ఏళ్లుగా రోడ్డుకు అడ్డంగా సింగరేణి హై టెన్షన్ విద్యుత్ స్తంభాలు ఉండడంతో చాలా మంది విద్యుత్ స్తంభాలు కనబడక ప్రమాదాలకు గురయ్యారు. దీనిపై ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్ రోడ్డుకు అడ్డగా ఉన్న స్తంభాలను తొలగించాలని సింగరేణి, కార్పొరేషన్ అధికారులకు సూచించడంతో తొలగించారు.

ఖని చౌరస్తాలో వెలిగిన విద్యుత్ దీపాలు

- ఆంధ్రజ్యోతి కథనానికి స్పందన

కళ్యాణ్‌నగర్, జూలై 9: రామగుండం కార్పొరేషన్ అధికారులు సోమవారం అంధకారంలో గోదావరిఖని చౌరస్తా శీర్షికన ఆంధ్రజ్యోతిలో వచ్చిన కథనానికి స్పందించారు. మంగళవారం ఎట్టకేలకు కొత్త విద్యుత్ దీపాలను బిగించారు. చీకటిమయమైన చౌరస్తాలో విద్యుత్ దీపాల వెలుగు రావడంతో ప్రయాణికుల కష్టాలు తీరాయి.

'నారీ భేరి' సభకు తరలివెళ్లిన బీజేపీ నేతలు



సభలో పాల్గొన్న సోమారపు లావణ్య తదితరులు

కళ్యాణ్‌నగర్, జూలై 9: మహిళలను వంచించిన కాంగ్రెస్ సర్కారుపై బీజేపీ మహిళా మోర్చా ఆధ్వర్యంలో హైదరాబాద్ ఇందిరాపార్కు వద్ద కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి కిషన్‌రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరైన నారీభేరి సభకు గోదావరిఖని నుంచి బీజేపీ మహిళా మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు సోమారపు లావణ్య ఆధ్వర్యంలో మహిళలు తరలివెళ్లారు.

చెత్త శుద్ధీకరణతో బహుళ ప్రయోజనాలు

- పెద్దపల్లి ఎమ్మెల్యే విజయరమణారావు



బయోమైనింగ్ మిషన్ పని విధానాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే విజయరమణారావు

పెద్దపల్లి రూరల్, జూలై 9 : చెత్త శుద్ధీకరణతో బహుళ ప్రయోజనాలు ఉన్నాయని పెద్దపల్లి ఎమ్మెల్యే విజయరమణారావు అన్నారు. పెద్దపల్లి మండలం గౌరెడ్డిపేట శివారులోని పెద్దపల్లి మున్సిపల్ డంపింగ్ యార్డు వద్ద ఏర్పాటు చేసిన బయో మైనింగ్ మిషన్ (చెత్త శుద్ధీకరణ యంత్రాన్ని) మంగళవారం కౌన్సిలర్‌లతో కలిసి ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పట్టణాల్లో వెలువడ్డ చెత్త డంపింగ్ యార్డులో ఏళ్ల తరబడి నిల్వ ఉండి సమస్యలు ఏర్పడుతున్నాయని, శుద్ధిచేస్తే దాని నుంచి రైతులకు ఉపయోగపడే ఎరువులు అందించవచ్చన్నారు. మిగిలిన ముడి పదార్థాలు ఇతర అవసరాలకు ఉపయోగించవచ్చని, యార్డులో చెత్త నిల్వలు తగ్గించేందుకు బయోమైనింగ్ మిషన్ ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ఆకుల వెంకటేష్, కౌన్సిలర్లు నూగిల్ల మల్లయ్య, బూతగడ్డ సంపత్, ఎరుకల కల్పన రమేష్, సాబీర్ ఖాన్, మేనేజర్ శివప్రసాద్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ రాంమోహన్ రెడ్డి, నాయకులు సందనవేన రాజేందర్, మస్రత్, కొమ్ము శ్రీనివాస్, కొమ్ము అభిలాష్, కొమ్ము కరుణాకర్, గజ్జెల కనుకయ్య, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

● నేడు గౌరెడ్డిపేటకు ఎమ్మెల్యే

గౌరెడ్డిపేటలో మున్సిపల్ డంపింగ్ యార్డు ఏర్పాటు చేయడం వల్ల విషపూరిత జ్వరాలు ప్రబలుతున్నాయని కనీసం ఎవరు పట్టించుకోవడం లేదని గ్రామస్థులు ఎమ్మెల్యే విజయరమణరావు దృష్టికి తీసుకురాగా బుధవారం అధికారుల బృందంతో గ్రామానికి రానున్నట్లు ఎమ్మెల్యే పేర్కొన్నారు. జ్వరాలు నియంత్రించేందుకు చర్యలు తీసుకుంటామని, వ్యాధులు ప్రబలకుండా ముందస్తు వైద్య సేవలు అందించేలా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ప్రజారోగ్యాన్ని కాపాడేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే తెలిపారు.

ఆసుపత్రి అధికారుల నిర్లక్ష్యంపై బీజేపీ రాస్తారోకో



రాస్తారోకో చేస్తున్న బీజేపీ నాయకులు

పెద్దపల్లి టౌన్, జూలై 9: జిల్లా ప్రభుత్వ ఆసుపత్రి అధికారుల నిర్లక్ష్యం వల్లనే బాలుడు సెప్టిక్ ట్యాంకులో పడ్డాడని, వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ బీజేపీ నాయకులు ఆసుపత్రి ఎదుటగల రాజీవ్ రహదారిపై రాస్తారోకో చేశారు. దీంతో కొద్దిసేపు వాహనాల రాకపోకలు నిలిచిపోగా, పోలీసులు వచ్చి రాస్తారోకో విరమింపజేశారు. ఈ సందర్భంగా బీజేపీ నాయకులు మాట్లాడుతూ ఆసుపత్రి సూపరింటెండెంట్, సిబ్బంది నిర్లక్ష్యం వల్ల ఆసుపత్రి సెప్టిక్ ట్యాంక్‌లో పడి బాలుడు తీవ్ర గాయాలతో కరీంనగర్ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడని తెలిపారు. గతంలో ఆసుపత్రిలో పలు ఘటనలు జరిగాయన్నారు. ఈ ఘటనపై విచారణ చేసి, సంబంధింత అధికారులపై చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌ను కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు శిలారపు పర్వతాలు అసెంబ్లీ కన్వీనర్ దాడి సంతోష్ బీజేపీ సీనియర్ నాయకులు తంగెడ రాజేశ్వరరావు పొల్సాని సంపత్ రావు, మేకల శ్రీనివాస్, ఒల్లే తిరుపతి, ఎర్రోళ్ల శ్రీకాంత్, వేల్పుల రమేష్, పడాల శ్రీనివాస్, గుడ్ల సతీష్, పెంజర్ల రాకేష్, కుక్క వంశీ, గాదరి సతీష్, పిట్ట వినయ్, కందుల సదయ్య, కందుల రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

కోర్టుల్లో కొత్త జీపీలు, ఏజీపీల నియామకం

- ఉత్తర్వులు జారీ చేసిన కలెక్టర్

కోల్‌సిటీ, జూలై 9: ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు జిల్లాలోని కోర్టుల్లో ఇప్పటి వరకు కొనసాగుతున్న లా ఆఫీసర్లను పక్కన పెట్టారు. వారి స్థానంలో ఇన్‌చార్జి లా ఆఫీసర్లను నియమించారు. సివిల్, క్రిమినల్‌కేసుల్లో ప్రభుత్వం తరఫున వాదనలు వినిపించేందుకు ఏడుగురు న్యాయవాదులను నియమిస్తూ జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష ఉత్తర్వులు జారీ చేశారు. జిల్లా ప్రిన్సిపాల్ జడ్జి కోర్టులో గవర్నమెంట్ ప్లీడర్‌గా డీ వెంకటసాంబమూర్తి నియమించారు. పెద్దపల్లిలోని సీనియర్, జూనియర్ సివిల్ జడ్జి కోర్టులకు అసిస్టెంట్ గవర్నమెంట్ ప్లీడర్‌గా కే శ్రీనివాస్, మంథని సీనియర్, జూనియర్ సివిల్ జడ్జి కోర్టులకు ఏజీపీగా కే వెంకటరాం రెడ్డిని నియమించారు. సుల్తానాబాద్ జూనియర్ సివిల్ జడ్జి కోర్టుకు ఏ లక్ష్మీరాజంను ఏజీపీగా నియమించారు. గోదావరిఖనిలోని ఇండస్ట్రియల్ ట్రిబ్యునల్, లేబర్ కోర్టు, అడిషనల్ డిస్ట్రిక్ట్ కోర్టులో ఏజీపీగా జే రాజయ్య, ప్రిన్సిపాల్ జూనియర్ సివిల్ జడ్జిలో ఏజీపీగా సీహెచ్ పద్మను నియమించారు. గోదావరిఖని సబ్ కోర్టుకు ఏజీపీగా నడిపెల్లి కిషన్‌రావును నియమించారు.

జిల్లాలో ప్రభుత్వశాఖలు, అధికారులను ప్రతి వాదులుగా చేస్తూ దాఖలయ్యే కేసుల్లో జీపీలు, ఏజీపీలు తమ వాదనలు వినిపిస్తారు.

సింగరేణి రక్షణకు తుది శ్వాస వరకు పోరాడుతాం

- కార్మిక పోరాటాలకు అండగా బీఆర్ఎస్ - మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్



సదస్సులో మాట్లాడుతున్న మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్

గోదావరిఖని, జూలై 9 : సింగరేణి రక్షణకు తుది శ్వాస వరకు పోరాడుతామని, కార్మిక పోరాటాలకు బీఆర్ఎస్ అండగా ఉంటుంది మాజీ మంత్రి, బీఆర్ఎస్ నాయకుడు కొప్పుల ఈశ్వర్ అన్నారు. మంగళవారం గోదావరిఖనిలోని టీబీజీకేఎస్ కేంద్ర కార్యాలయంలో బొగ్గు గనుల వేలానికి నిరసనగా జరిగిన కార్మిక సదస్సులో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. బొగ్గుగనుల వేలాన్ని తక్షణమే నిలిపివేయకుంటే ప్రజా క్షేత్రంలో గుణపాఠం తప్పదన్నారు. ఎన్నికల ముందు సింగరేణి రక్షిస్తామని గద్దెనెక్కిన రేవంత్‌రెడ్డి బీజేపీకి వంతపాడడం సిగ్గుచేటన్నారు. ప్రభుత్వరంగ సంస్థలను అమ్మడమే ధ్యేయంగా బీజేపీ పని చేస్తున్న విషయాన్ని కార్మికులు గమనించాలని కోరారు. బొగ్గు గనుల వేలాన్ని ప్రారంభించింది కాంగ్రెస్ పార్టీ హయాంలోనేనని, వారి బాటలోనే బీజేపీ పయనించి ప్రజల, ప్రభుత్వ రంగ సంస్థల ఊపిరి తీస్తున్నదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. లక్షలాది మందికి జీవితాన్ని ప్రసాదించిన సింగరేణి సంస్థను కాపాడుకుంటామని ఆయన హామీ ఇచ్చారు. బలమైన కార్మిక ఉద్యమాల ద్వారానే సింగరేణి సంస్థను ఆదుకుంటామని స్పష్టం చేశారు. నాలుగు బొగ్గు గనుల వేలంతోనే ఈ ప్రక్రియ ఆగదని, సింగరేణిని నష్టాల బూచి చూపి మూసివేసే వరకు కాంగ్రెస్, బీజేపీ నాయకులు పనిచేస్తారని ఆరోపించారు. ఐక్య పోరాటాల ద్వారా సింగరేణి సంస్థను కాపాడుకోవడానికి రాజకీయాలకు అతీతంగా కార్మిక సంఘాలు, పార్టీలు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. సింగరేణిలో ప్రస్తుతం పని చేస్తున్న 50శాతం మందికి బీఆర్ఎస్ ప్రభుత్వమే ఉద్యోగాలు కల్పించిన విషయాన్ని మర్చిపోరాదన్నారు. టీబీజీకేఎస్ రాష్ట్ర అధ్యక్షుడు మిరియాల రాజిరెడ్డి అధ్యక్షతన జరిగిన సదస్సులో మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్, సీనియర్ నాయకులు కౌశిక హరి, టీబీజీకేఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సురేందర్ రెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ మాదాసి రామమూర్తి, సీనియర్ ఉపాధ్యక్షుడు నూనె కొమురయ్య, కేంద్ర నాయకులు పర్లపల్లి రవి, సంపత్‌రెడ్డి, బండి రమేష్, ఓ రాజశేఖర్, ఎన్.సదానందం, కనకం శాంసన్, బడికెల సంపత్ కుమార్, వివిధ డివిజన్ల ఉపాధ్యక్షులు వడ్డేపల్లి శంకర్, ఐలీ శ్రీనివాస్, నాగెల్లి సాంబయ్య, పెట్టం లక్ష్మణ్, మేడిపల్లి సంపత్, మల్రాజు శ్రీనివాసరావు పాల్గొన్నారు.

పోలీస్‌స్టేషన్ ఎదుట మహిళ బైఠాయింపు

రామగిరి, జూలై 9: తనకు న్యాయం చేయాలని ఓ మహిళ మంగళ వారం రామగిరి పోలీస్‌స్టేషన్ ఎదుట బైఠాయించింది. రామగిరి మండలం బేగంపేట్ గ్రామానికి చెందిన దాసరి శివకుమార్ తనను పెళ్లి చేసుకుంటానని నమ్మబలికి శారీరకంగా లొంగదీసుకొని మోసం చేశాడని అదే గ్రామానికి చెందిన ముత్యాల కొమలత మే 25న పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. దీంతో పాటు తన వద్ద నుంచి డబ్బులు తీసుకొని తిరిగి ఇవ్వడం లేదని ఫిర్యాదులో పేర్కొంది. తాను ఫిర్యాదు చేసి నెల రోజులు గడుస్తున్నా పరారీలోనే ఉన్నాడని తెలిపింది. జూలై 8న గ్రామంలోని మెడికల్ షాప్‌నకు మందుల కోసం వెళ్తుండగా దాసరి శివ తమ్ముడు, చెల్లెలు కేసు విషయంలో రాజీపడాలని, లేదంటే తనను తన పిల్లలని చంపుతానని బెదిరింపులకు గురిచేశారని ఆవేదన వ్యక్తం చేసింది. దాసరి శివ కుటుంబంతో తనకు ప్రాణభయం ఉందని, ఇప్పటికైపోలీసులు స్పందించాలని శివను అరెస్ట్ చేయాలని పోలీస్ స్టేషన్ ఎదుట రోదిస్తూ బైఠాయించింది. దీంతో మహిళ కానిస్టేబుల్‌లు వచ్చి నిరసన వ్యక్తం చేస్తున్న మహిళను స్టేషన్ ఆవరణలోకి తరలించారు. కాగా ముత్యాల కొమలత ఇచ్చిన ఫిర్యాదు మేరకు నిందితుడి కోసం గాలింపు చర్యలు చేపడుతున్నట్లు ఎస్ఐ సందీప్ తెలిపారు. బాధిత మహిళకు న్యాయం జరిగే విధంగా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

యువకులపై కేసు నమోదు

రాయికల్, జూలై 9: మండలంలోని రామాజీపేట గ్రామానికి చెందిన ఇద్దరిపై మంగళవారం కేసు నమోదైంది. వడుకాపురం శ్రీవాత్సవ్‌కు అదే గ్రామానికి చెందిన మాణిక్యం గంగాధర్, పందిరి ప్రమోద్‌లు రాయికల్ పోలీస్‌స్టేషన్ నుంచి ఫోన్ చేస్తున్నామని చెప్పి డబ్బులు ఇవ్వమని డిమాండ్ చేశారు. దీంతో శ్రీ వాత్సవ్ మంగళవారం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఇరువురు యువకులపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై అశోక్ తెలిపారు.

బాలికను లైంగికంగా వేధించిన కేసులో మహిళకు జైలుశిక్ష

జగిత్యాల టౌన్, జూలై 9: బాలికను కిడ్నాప్ చేసి లైంగికంగా లోబర్చుకున్న ఓ మహిళకు ఒక కేసులో 5 సంవత్సరాల కఠిన కారాగార జైలు శిక్షతో పాటు రూ. 10 వేల జరిమానా, మరొక కేసులో మూడేళ్ల కఠిన కారాగార జైలు శిక్షతో పాటు రూ. 5 వేల జరిమానా విధిస్తూ జగిత్యాల కోర్టు ప్రధాన న్యాయమూర్తి నీలిమ మంగళవారం తీర్పునిచ్చారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం..

కోరుట్ల పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఓ కాలనీకి చెందిన బాలికకు తన ఇంటి పక్కనే నివసిస్తున్న అస్మా అంజూ అనే మహిళతో పరిచయం ఏర్పడింది. బాలికకు సదరు మహిళ మాయమాటలు చెప్పి ఇంట్లో నుంచి బయటకు తీసుకెళ్లింది. అసభ్యకరమైన కార్యకలాపాలతో లైంగికంగా లోబరుచుకుంది. అప్పట్లో ఈ విషయం సంచలనంగా మారగా బాలిక తండ్రి ఫిర్యాదు మేరకు కోరుట్ల పోలీసులు నిందితురాలు అస్మా అంజూపై 2020-21 సంవత్సరంలో ఫోక్సోతో పాటు వివిధ సెక్షన్ల కింద రెండు కేసులు నమోదు చేశారు.

కేసు దర్యాప్తు చేసిన పోలీసులు నిందితురాలు అస్మా అంజూను కోర్టులో హాజరు పరుచగా అడిషనల్ పీపీ మల్లిఖార్జున్ కేసు వాదించారు. అప్పటి డీఎస్పీ రాజశేఖర్ రాజుతో పాటు ఎస్సైలు సతీష్, పృథ్వీదర్, రాజ ప్రమీల, రాజు నాయక్‌లతో పాటు కోర్టు డ్యూటీ అధికారులు కిరణ్ కుమార్, రాజు, నీల నాయక్‌లు సాక్ష్యులను కోర్టులో ప్రవేశపెట్టారు. కేసును విచారించిన న్యాయమూర్తి నీలిమ నిందితు రాలు అస్మా అంజూకు జైలు శిక్షతో పాటు రూ. 15 వేల జరిమానా విధిస్తూ గత జూన్ 26న తీర్పు వెలువరించారు.

ఈ కేసుల్లో తప్ప కుండా శిక్ష పడుతుందని గమనించిన అస్మా అంజూ బెయిల్‌పై బయటి ఉండి విచారణకు రాకుండా శిక్ష పడిన జూన్ 26వ తేదీన కోర్టుకు హాజరు కాకుండా తప్పించుకుపోయింది. ఈ విషయం తెలుసుకున్న న్యాయమూర్తి నిందితురాలిపై వారెంట్ ఇష్యూ చేయగా మంగళవారం పోలీసులు నిందితురాలు అస్మా అంజూను పట్టుకుని జైలుకు తరలించారు. నిందితురాలికి జైలు శిక్ష పడడంలో కృషి చేసిన పోలీస్ అధికారులను ఎస్పీ అశోక్ కుమార్ అభినందించారు.

గంజాయి కేసులో మరో ఇద్దరు అరెస్టు

మెట్‌పల్లి, జూలై 9: గంజాయి తరలింపు కేసులో మరో ఇద్దరిని అరెస్టు చేసి, వారి నుంచి ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకున్నామని డీఎస్పీ ఉమా మహేశ్వర్‌రావు తెలిపారు. మంగళవారం మెట్‌పల్లి పోలీసుస్టేషన్‌లో సీఐ నిరంజన్‌రెడ్డి, ఎస్సైలు చిరంజీవి, అనిల్‌కుమార్‌లతో కలిసి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. ఈ నెల 6న మండలంలోని మేడిపల్లి శివారులో ఇబ్రహీంపట్నం ఎస్సై అనిల్ సిబ్బందితో కలిసి వాహనాల తనిఖీ నిర్వహించాడు.

అదే సమయంలో అనుమానాస్పదంగా కోరుట్ల పట్టణానికి చెందిన నలుగురు యువకులు గంజాయి తీసుకొని రెండు ద్విచక్ర వాహనాలపై అక్కడి వచ్చారు. పోలీసులను గమనించి ఇద్దరు యువకులు ద్విచక్ర వాహనంపై పారిపోగా మరో ఇద్దరు మైనర్లు పట్టుబడ్డారు. అందులో తప్పించుకుని పారిపోయిన విజయ్, ఉదయ్ ఇద్దరి కోసం ఎస్సైలు చిరంజీవి, అనిల్‌కుమార్‌లు గాలిం పు ముమ్మరం చేశారు. మంగళవారం ఇబ్రహీంపట్నం శివారులో అనుమానాస్పందంగా కనిపించడంతో పట్టుకొని విచారించారు. నేరం ఒప్పుకొని మహారాష్ట్రలోని నాందేడ్‌కు చెందిన మహమ్మద్ అజార్ వద్ద గంజాయి కొనుగోలు చేసి కోరుట్లకు తీసుకొస్తు న్నట్లు తెలిపారు. నాందేడ్‌లో గంజాయి అమ్ముతున్న



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ ఉమామహేశ్వర్‌రావు, సీఐ నిరంజన్‌రెడ్డి

మహమ్మద్ అజార్‌తో పాటు నలుగురుని పట్టుకోవడంలో చాకచక్యంగా వ్యవహరించిన సీఐ నిరంజన్‌రెడ్డి ఎస్సైలు చిరంజీవి, అనిల్‌కుమార్‌లతో పాటు సిబ్బందిని అభినందించారు.

డ్రంకెన్‌డ్రైవ్ కేసులో ఐదుగురుకి జైలు శిక్ష

కరీంనగర్ క్రైం, జూలై 9: డ్రంకెన్‌డ్రైవ్ తనిఖీల్లో పట్టుబడిన ఐదుగురు వ్యక్తులకు కరీంనగర్ మున్సిఫ్‌కోర్టు జడ్జి మంగళవారం జైలు శిక్ష, జరిమానా విధించారని కరీంనగర్ ట్రాఫిక్ సీఐ కరీం ఉల్లాఖాన్ తెలిపారు. ఇటీవల తనిఖీల్లో పట్టుబడిన 23 మందిని కోర్టులో హాజరు పరచగా అందులో ఇద్దరు వ్యక్తులకు ఐదు రోజుల జైలు శిక్ష, ముగ్గురికి మూడు రోజుల జైలు శిక్ష, మొత్తం 11వేల రూపాయల జరిమానా విధించారని తెలిపారు. మిగతా 18 మందికి 27 వేల రూపాయలు జరిమానా విధించి నట్లు పేర్కొన్నారు. ఇందులో ఒక మైనర్‌కు 2,500 రూపాయలు జరిమా నా విధించినట్లు తెలిపారు.

వైద్యుడిని దూషించిన వ్యక్తిపై కేసు

కరీంనగర్ క్రైం, జూలై 9: వైద్యుడిని దూషించి, దాడి చేసేందుకు ప్రయత్నించిన వ్యక్తిపై మంగళవారం కేసు నమోదు చేసినట్లు కరీంనగర్ రూరల్ పోలీసులు తెలిపారు. కరీంనగర్ శివారులోని చల్మెడ ఆసుపత్రిలో పీజీ చదువుతూ డ్యూటీ డాక్టర్‌గా విధులు నిర్వహిస్తున్న బానోతు రవి కుమార్ అనే వైద్యుడి విధులను ఆటంకపరచి దూషించి, దాడి చేసేందుకు యత్నించిన శ్యామ్ అనే వ్యక్తిపై కేసు నమోదు చేశామని పోలీసులు తెలిపారు. ఈనెల 7న సాయంత్రం శ్యామ్ అనే వ్యక్తి ఆసుపత్రిలోని అత్యవసర విభాగంలోకి వచ్చి తనకు చికిత్స చేయాలంటూ అక్కడ విధుల్లో ఉన్న వైద్యుడిని దూషించి, గ్లాస్ డోర్‌ను పగుల గొట్టాడని బాధితుడు పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నాడు. ఈ మేరకు మంగళవారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

అంధుల గురుకుల పాఠశాలలో విద్యార్థి మృతి

ప్రిన్సిపాల్ నిర్లక్ష్యంతోనే మృతి చెందాడని తండ్రి ఫిర్యాదు



శ్రీవత్సవ్(ఫైల్)

కరీంనగర్ క్రైం, జూలై 9: కొత్తపల్లి మండలం రేకుర్తి పరిధిలోని ప్రభుత్వ అంధుల ఆశ్రమ పాఠశాలలో మంగళవారం దామ శ్రీవత్సవ్(13) అనే విద్యార్థి టవల్ మెడకు చుట్టుకుని మృతి చెందాడు. పాఠశాల ప్రిన్సిపాల్ మంగళవారం మధ్యాహ్నం విద్యార్థి తండ్రికి ఫోన్ చేసి మీ కొడుకు శ్రీవత్సవ్ వాంతులు చేసుకుంటున్నాడు, జ్వరం వచ్చినట్లుంది తొందరగా రావాలని చెప్పినట్లు శ్రీవాత్సవ్ తండ్రి దామ సది తెలిపారు. మళ్లీ ప్రిన్సిపాల్ ఫోన్ చేసి కరీంనగర్ ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్పించినట్లు చెప్పాడని, తాము వెళ్లి చూసే సరికి శ్రీవత్సవ్ మరణించి ఉన్నాడని చెప్పారు. పాఠశాలలోని సీసీ కెమెరా పుటేజీలను తాము కూడా పరిశీలించామని, శ్రీవత్సవ్ మధ్యాహ్నం దండానికి ఉన్న టవల్‌ను మెడకు చుట్టుకుని ఆడుతూ ఒక్కసారిగా ఆగిపోయినట్లు ఉందన్నాడు. శ్రీవత్సవ్ మృతికి పాఠశాల ప్రిన్సిపాల్, సిబ్బంది నిర్లక్ష్యమే కారణమని దామ సది పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పెద్దపల్లి జిల్లా ఎలిగేడ్ మండలం ముప్పిరి తోటకు చెందిన దామ శ్రీవత్సవ్‌కు పుట్టుకతోనే ఒక కన్ను కనిపించదు. దీంతో తల్లిదండ్రులు అతడిని ఆరేళ్ల క్రితం రేకుర్తిలోని అంధుల పాఠశాలలో చేర్పించాడు. ప్రస్తుతం శ్రీవత్సవ్ ఏడో తరగతి చదువుతున్నాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

అతిగా మద్యం తాగి వ్యక్తి మృతి

మెట్‌పల్లి రూరల్, జూలై, 9 : మండలంలోని మేడిపల్లి గ్రామానికి చెందిన నరేందర్(45)అతిగా మద్యం తాగి పట్టణంలోని ఓ పంక్షన్ హాల్ సమీపంలో మంగళవారం మృతి చెందాడు. మెట్‌పల్లి ఎస్సై చిరంజీవి తెలిపిన వివరాల ప్రకారం..మేడిపల్లి గ్రామానికి చెందిన నరేందర్ పాత సామాన్లు వస్తువులు ఏరుకుంటూ వచ్చిన డబ్బులతో మద్యం సేవించేవాడు. మద్యానికి బానిసై నరేందర్ అతిగా తాగి మత్తులోనే పాత సామాన్ల కోసం మెట్‌పల్లిలోని ఓ ఫంక్షన్ హాల్ సమీపంలో పడిపోయాడు. ఎంతకు అతనిలో ఎలాంటి కదలిక లేక పోవడంతో గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు వచ్చి గమనించి అతడు మృతి చెందినట్లు గుర్తించి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతి



కరీంనగర్ క్రైం, జూలై 9: కరీంనగర్ సాయినగర్‌లోని సాయి బాబా గుడి వద్ద భిక్షాటన చేస్తున్న గుర్తుతెలియని వ్యక్తి (50) మంగళవారం మధ్యాహ్నం 3 గంటల ప్రాంతంలో మూర్చ వ్యాధితో మరణించాడని ప్రభుత్వ ఆసుపత్రిలో అవుట్‌పోస్టు హెడ్ కానిస్టేబుల్ కె.రవిందర్ తెలిపారు. మృతదేహాన్ని ప్రభుత్వ ఆసుపత్రిలోని మార్చురీ గదిలో భద్రపరిచామని తెలిపారు. మృతుడిని గుర్తించిన వారు కరీంనగర్ రెండో టౌన్ సీఐ 8712670762, హెడ్ కానిస్టేబుల్ రవీందర్ 9491481433 నంబర్‌కు సమాచారం అందించాలని కోరారు.

రెస్టారెంట్‌లో అధికారుల తనిఖీలు

శుభ్రంగా లేకపోవడంతో రూ.35వేల జరిమానా



రెస్టారెంట్‌లో ఆహార పదార్థాలను పరిశీలిస్తున్న కార్పొరేషన్ సిబ్బంది

కోల్‌సిటీ, జూలై 9: పెద్దపల్లి జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు రామగుండం నగరపాలక సంస్థ హెల్త్‌అసిస్టెంట్లు మంగళవారం గోదావరిఖని కవిత థియేటర్ సమీపంలోని సాఫ్రాన్ మండి హౌస్‌లో తనిఖీలు జరిపారు. సరైన పరిశుభ్రత పాటించకుండా నిల్వ ఉంచిన ఆహార పదార్థాలను గుర్తించినట్లు కిరణ్, వైకుంఠం పేర్కొన్నారు. రెస్టారెంట్ యజమానులకు రూ.30వేల జరిమానా విధించామన్నారు. ఈ ఆహార పదార్థాలను తిరిగి వినియోగించకుండా చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. దాడుల్లో ఎన్విరాన్‌మెంట్ ఇంజనీర్ మధుకర్ పాల్గొన్నారు.

ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయానికి వాస్తు దోషం

● మార్పులు, చేర్పులు ప్రారంభం
● తమకు సంబంధం లేదంటున్న ఆర్అండ్‌బీ అధికారులు
● ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి సొంత నిధులతో పనులు



హుజూరాబాద్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో కొనసాగుతున్న పనులు

హుజూరాబాద్, జూలై 9: హుజూరాబాద్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయానికి వాస్తు దోషం ఉందని మంగళవారం మరమ్మతులు ప్రారంభించారు. ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి తన సొంత ఖర్చులతోనే మరమ్మతులు చేయిస్తుండడం చర్చనీయాంశంగా మారింది. ఈ క్యాంపు కార్యాలయానికి వాస్తు బాగా లేకపోవడం వలనే అపశృతు లు చోటు చేసుకుంటున్నాయనే ఉద్దేశ్యంతో పోర్టికో, కిటికీలు, తలుపు లు తొలగిస్తున్నారని ప్రచారం సాగుతోంది. గతంలో హుజూరాబాద్ నుంచి ఏడుసార్లు గెలిచి, తెలంగాణ ఉద్యమం, ప్రత్యేక రాష్ట్రం వచ్చిన ప్రభుత్వంలో కీలకంగా వ్యవహరించిన ఈటల రాజేందర్ ఈ క్యాంపు కార్యాలయానికి వెళ్లిన తర్వాతనే ప్రతికూల పరిస్థితులు ఎదుర్కొన్నారన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఈ భవనం పనులు 2019లో ప్రారంభించి 2020లో పూర్తి చేశారు. ఈ కార్యాలయంలోకి వెళ్లిన తర్వాత ఈటల రాజేందర్ మంత్రి పదవి నుంచి బర్తరఫ్ అయ్యారు. అనంతర పరిణామాలతో ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేశారు. తరువాత జరిగిన ఉప ఎన్నికలో బీజేపీ నుంచి పోటీ చేసి గెలిచినా ప్రతిపక్షంలో ఉండడంతో ఆయనకు నియోజకవర్గంలో ఎలాంటి ప్రాధాన్యం లభించలేదు. ఆ సమయంలో ఎమ్మెల్సీగా ఉన్న పాడి కౌశిక్‌రెడ్డి అన్నీ తానై వ్యవహరించేవాడు. ఆ సమయంలో ఈటల రాజేందర్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయాన్ని ఉపయోగించేవారు. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేసిన ఈటల రాజేందర్ ఓడిపోయారు. ఈటలకు కంచుకోటగా ఉన్న హుజూరాబాద్‌లో ఆయన ఓడిపోవడంతో అందరూ ఆశ్చర్యపోయారు. ఇదంతా ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయానికి వాస్తు దోషం ఉండడం వల్లే జరిగిందని ప్రచారం జరిగింది. దీంతో ఎన్నికల్లో గెలిచి ఆరు నెలలైనా ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం వైపు కన్నెత్తి చూడలేదు. నాలుగు రోజుల క్రితం ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి వాస్తు పండితులను తీసుకొచ్చి చూపించడంతో వారు పలు సూచనలు చేశారు. దానికి తగ్గట్లు పనులు ప్రారంభించారు.. ఈ విషయంపై ఆర్అండ్‌బీ డీఈని వివరణ కోరగా ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో జరుగుతున్న పనులకు తమకు ఎలాంటి సంబంధం లేదన్నారు.

ఎస్సారెస్పీలోకి కొనసాగుతున్న వరద

● ప్రాజెక్టులోకి 3,275 క్యూసెక్కుల నీరు

జగిత్యాల, జూలై 9 (ఆంధ్రజ్యోతి): శ్రీరాంసాగర్ ప్రాజెక్టులోకి ఎగువ ప్రాంతాల నుంచి ఇన్‌ఫ్లో కొనసాగుతోంది. మంగళవారం వరద నీరు వచ్చి చేరుతుండడంతో ప్రాజెక్టు నీటి మట్టం క్రమంగా పెరగుతోంది. ఎగువ ప్రాంతాల్లో కురిసిన వర్షాలతో పాటు, బాబ్లీ గేట్లు ఎత్తివేయడంతో ఎస్సారెస్పీలోకి 3,275 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వచ్చి చేరుతోంది. ప్రాజెక్టు నీటి నిల్వ 90.323 సామర్థ్యానికి ప్రస్తుతం 12.208 టీఎంసీల నీరు నిల్వ ఉంది. గత యేడాది ఇదే సమయానికి ప్రాజెక్టులో 16.824 టీఎంసీల నీరు నిల్వ ఉంది. మిషన్ భగీరథ, ఇతరములకు కలిపి ప్రాజెక్టు నుంచి 479 క్యూసెక్కుల నీటిని వదిలారు. జూన్ 1వ తేదీ నుంచి ఇప్పటివరకు ప్రాజెక్టులోకి 6.258 టీఎంసీల వరద నీరు వచ్చి చేరింది.

నల్లగొండ ఆలయంలో దొంగతనం

కొడిమ్యాల, జూలై 9: మండలంలోని నల్లగొండ శ్రీలక్ష్మీనర్సింహస్వామి ఆలయంలో సోమవారం అర్ధరాత్రి దాటిన తరువాత చోరీ జరిగింది. ఆలయ సిబ్బంది గర్భ గుడి తాళాలు పగిలి ఉండటం గమనించి మంగళవారం ఉదయం ఎస్సై సందీప్‌కు సమాచారం అందించడంతో సిబ్బందితో అక్కడకు చేరుకున్న ఎస్సై డాగ్ స్క్వాడ్‌తో పరిశీలించారు. గుర్తుతెలియని వ్యక్తులు గుడి తాళాలు పగులగొట్టి నర్సింహస్వామి విగ్రహంపై ఉన్న విలువైన 5.3 తులాల బంగారు ఆభరణాలు పుస్తెలు, కాసులహారం ఎత్తుకు పోయినట్లు గుర్తించారు. ఆలయ ఈవో ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు. ఆలయంలోని ఉత్సవ మూర్తులపై ఉన్న వెండి ఆభరణాలను వదిలి పోయినట్లు సిబ్బంది తెలిపారు. కొడిమ్యాల ఎస్సై ఆధ్వర్యంలో పోలీసులు ఆలయ సిబ్బందిని, పలువురు భక్తులను విచారించారు.

రేషన్ బియ్యం పట్టివేత



రేషన్ బియ్యం పట్టుకున్న అధికారులు

సుల్తానాబాద్, జూలై 9: సుల్తానాబాద్ మండలంలోని ఐతరాజ్‌పల్లి గ్రామంలో అక్రమంగా నిలువ చేసి ఉంచిన 22 క్వింటాళ్ల రేషన్ బియ్యంను పట్టుకున్నట్లు జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారి ప్రేమ్‌కుమార్ తెలిపారు. మంగళవారం జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారి ప్రేమ్‌కుమార్ సుల్తానాబాద్ మండలంలో పలు గ్రామాలలో ఎన్‌ఫోర్స్‌మెంట్ సిబ్బందితో కలసి తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఐతరాజ్‌పల్లి గ్రామంలో యార్ల మల్లయ్య ఇంటి వద్ద ఆటోలో తరలించడానికి సిద్దంగా ఉన్న 22 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టుకున్నామని ప్రేమ్‌కుమార్ వివరించారు. ఇట్టి బియ్యాన్ని పెద్దపల్లి ఎంఎల్ఎస్ పాయింట్‌కు తరలించామని అన్నారు. యార్ల మల్లయ్యపై పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

● తంగళ్లపల్లి: తంగళ్లపల్లి మండలం పాపయ్యపల్లె గ్రామంలో పీడీఎస్ బియ్యం పట్టుకుని ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై సుధాకర్ తెలిపారు. మంగళవారం ఉదయం ఆటోలో పీడీఎస్ బియ్యం తరలిస్తున్నారనే సమాచారంతో దాడులు చేశామన్నారు. ఆరు క్వింటాళ్ల బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నామని, బద్దెనపల్లికి చెందిన మోతె విజయ్‌ను అదుపులోకి తీసుకున్నామని తెలిపారు. విజయ్‌ను విచారించగా గ్రామాల్లో పీడీఎస్ బియ్యాన్ని సేకరించి సిద్ధిపేట జిల్లా చిన్నకోడూరు మండలం రామంచ గ్రామానికి చెందిన నరేష్‌కు విక్రయిస్తున్నట్లు తెలిపాడన్నారు. ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు వివరించారు.

● జగిత్యాల టౌన్: రెండు క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని మంగళవారం టౌన్ ఎస్సై మన్మధరావు ఆధ్వర్యంలో పోలీసులు పట్టుకున్నారు. పట్టణంలోని మంచినీళ్ల బావి ప్రాంతం నుంచి షేక్ అంజద్ అనే వ్యక్తి రేషన్ బియ్యాన్ని పక్కదారి పట్టిస్తున్నట్లు గుర్తించి కేసు నమోదు చేసి బియ్యాన్ని సీజ్ చేసినట్లు ఎస్సై వివరించారు.

ఘనంగా జగన్నాథ రథోత్సవం



కోరుట్లలో రథోత్సవంలో పాల్గొన్న భక్తులు

కోరుట్ల, జూలై 9: హరే రామ... హరే కృష్ణ నామస్మరణతో కోరుట్ల పట్టణం మారుమోగింది. మంగళవారం పెద్దపూర్ ఇస్కాన్ దేవాలయ ఆధ్వర్యంలో కోరుట్ల పట్టణంలో జగన్నాథ రథోత్సవం ఘనంగా సాగింది. పట్టణంలోని వేంకటేశ్వర, నగేశ్వర దేవాలయాలలో ప్రత్యేక పూజలు నిర్వహించిన ఇస్కాన్ దేవాలయ నిర్వాహకులు భక్తులు రథోత్సవం ప్రారంభించారు. రథోత్సవం వేంకటేశ్వర దేవాలయం నుంచి ఐబీ రోడ్డు నంది, కార్గిల్, అంబేడ్కర్ చౌరస్తాల మీది జాతీయ రహదారిపై కొనసాగింది. ఈ సందర్భంగా భక్తులు హరే రామ హరే కృష్ణ నామస్మరణతో భజనలతో నృత్యాలు చేస్తూ రథోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు రహదారులను నీటితో శుభ్రం చేయగా ఇస్కాన్ భక్తులు రోడ్లపై రంగవళ్లులు వేస్తూ స్వాగతం పలికారు. బీజేపీ రాష్ట్ర నాయకుడు సురభి నవీన్ కుమార్ రథోత్సవంలో పాల్గొన్న భక్తులతో కలిసి నృత్యాలను చేశారు. ఈ కార్యక్రమంలో ఇస్కాన్ దేవాలయ నిర్వాహకులు పాల్గొన్నారు. ఎలాంటి సంఘటనలు చోటు చేసుకోకుండా కోరుట్ల సిఐ సురేష్ బాబు ఆధ్వర్యంలో ఎస్ఐ కిరణ్ కుమార్ తన సిబ్బందితో బందోబస్తు నిర్వహించారు.

చికిత్స పొందుతూ ఒకరి మృతి

శంకరపట్నం, జూలై 9: రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతూ ఓ వ్యక్తి మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మానకొండూర్ మండలం గట్టుదుద్దెనపల్లి గ్రామానికి చెందిన కాశక రఘువరణ్ (44) అనే వ్యక్తి ఈ నెల 7న అతని బావమరిది పొరముళ్ల శ్రీనివాస్‌తో కలిసి బైక్‌పైన శంకరపట్నం మండలం లింగాపూర్‌లోని బంధువుల ఫంక్షన్‌కు వెళ్తున్నారు. అత్యవసర పనుల నిమిత్తం మెట్‌పల్లి గ్రామానికి వెళ్తుండగా శ్రీలక్ష్మీనర్సింహస్వామి రైస్‌మిల్ వద్దకు చేరుకోగానే టిప్పర్ డ్రైవర్ అతివేగంగా, అజాగ్రత్తగా నడుపుకుంటూ వచ్చి బైక్‌ను ఢీ కొట్టాడు. బైక్ పైనుంచి ఇద్దరు కింద పడగా, కాశక రఘువరణ్ తలకు తీవ్ర గాయాలయ్యాయి. వరంగల్‌లోని ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు.

టీజీఎస్ఆర్టీసీ లాజిస్టిక్స్ ఏజెంట్ల కోసం దరఖాస్తుల ఆహ్వానం

పెద్దపల్లి టౌన్, జూలై 9: టీజీఎస్ఆర్టీసీ కరీంనగర్ రీజియన్ పరిధిలో గల జిల్లా కేంద్రాల్లో, పట్టణ, మండల కేంద్రాల్లో టీజీఎస్ ఆర్టీసీ లాజిస్టిక్స్ ఏజెంట్ల కొరకు దరఖాస్తులు స్వీకరిస్తున్నామని కరీంనగర్ లాజిస్టిక్స్ ఏటీఎం ఎస్ సదాశివ్ ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా కేంద్రాలలో ఏజెంట్ కొరకు 5,000 రూపాయలు, మండల కేంద్రాల్లో 1000 రూపాయలు డీడీల రూపంలో చెల్లించాలని పేర్కొన్నారు. ఆసక్తిగల వాళ్లు కరీంనగర్, గోదావరిఖని, పెద్దపల్లి, హుజురాబాద్ సంబంధిత మండలాల వాళ్లు సేల్స్ టీం లీడర్ రాజు 9154298581ను, జగిత్యాల జిల్లాలోని మండలాల వారు రమేష్ 9154298572ను, సిరిసిల్ల జిల్లాలోని వాళ్లు శేఖర్ రావు 9154298576ను, హుస్నాబాద్ పరిధిలోని మండలాల వాళ్లు సురేష్ 9154298673ను సంప్రదించగలరని ఏటీఎం తెలిపారు. దీనికి గడువు తేదీ లేదని, ఆసక్తిగల వాళ్లు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

యువతి ఆత్మహత్య

వెల్గటూర్, జూలై 9: మండలంలోని శాఖాపూర్ గ్రామానికి చెందిన రంగం పూజిత (19) అనే యువతి మంగళవారం ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. ఎస్సై ఉమాసాగర్ తెలిపిన వివరాల ప్రకారం.. మృతురాలు పూజిత ఇంటర్‌మీడియట్ పూర్తి చేసింది. డిగ్రీ మొదటి సంవత్సరం కరీంనగర్‌లోని ఓ కళాశాలలో చేరింది. అక్కడ తనతో చదివిన స్నేహితులు ఎవరూ లేరని కుటుంబీకులకు చెప్పి బాధపడింది. మంగళవారం తల్లి కూరగాయలు అమ్మడానికి ధర్మారం వెళ్లింది. తమ్ముడు చదువుకోవడానికి పాఠశాలకు వెళ్లాడు. ఎవరూ లేని సమయంలో ఇంటిలో ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నది. తండ్రి జీవనోపాధి నిమిత్తం విదేశాలకు వెళ్లాడు.

చికిత్స పొందుతూ వృద్ధుడి మృతి

మెట్‌పల్లి రూరల్, జూలై 9: మండలంలోని చౌలమద్ది గ్రామానికి చెందిన గొట్టిపడుత శంకర్‌గౌడ్(67)అనే వృద్ధుడు ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డాడు. హైదరాబాద్‌లోని నిమ్స్‌లో చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందినట్లు ఎస్సై చిరంజీవి తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం శంకర్‌గౌడ్ ఈ నెల 2న ఆరపేట ఎక్స్ రోడ్డు సమీపంలో ప్రమాదవశాత్తు ద్విచక్రవాహనం అదుపుతప్పి కింద పడ్డాడు. హైదరాబాద్‌లోని నిమ్స్‌లో చికిత్స పొందుతున్న శంకర్‌గౌడ్ మంగళవారం మృతి చెందినట్లు తెలిపారు. మృతుడు అన్న గొట్టిపడుత గంగారం ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్ర గాయాలు

ఎల్లారెడ్డిపేట, జూలై 9: ఎల్లారెడ్డిపేట మండలం గొల్లపల్లి బస్టాండు ప్రాంతంలోని కామారెడ్డి-సిరిసిల్ల ప్రధాన రహదారిపై మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో గొల్లపల్లికి చెందిన కిష్టస్వామిగౌడ్ తీవ్ర గాయాలపాలయ్యాడు. క్షతగాత్రుడిని 108 వాహనంలో మండల కేంద్రంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. కిష్టస్వామిగౌడ్ తన స్కూటీపై గొల్లపల్లి బస్టాండు ప్రాంతంలో యూటర్న్ తీసుకుంటున్నాడు. ఈ క్రమంలో మండలంలోని బుగ్గరాజేశ్వరతండాకు చెందిన యువకుడు రాజేందర్ బైక్‌తో అతివేగంగా ఢీకొట్టాడు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

సెప్టిక్ ట్యాంకులో పడిన బాలుడు

● పెద్దపల్లి ప్రభుత్వ ఆసుపత్రిలో ఘటన ● బాలుడి పరిస్థితి విషమం



బాలుడిని అంబులెన్స్‌లో కరీంనగర్‌కు తరలిస్తున్న సిబ్బంది



పెద్దపల్లి ప్రభుత్వ ఆసుపత్రిలో మూత తీసి ఉన్న సెప్టిక్ ట్యాంక్

పెద్దపల్లి టౌన్, జూలై 9: పెద్దపల్లి ప్రభుత్వ ఆసుపత్రి సిబ్బంది నిర్లక్ష్యం కారణంగా ఓ బాలుడి ప్రాణాపాయ స్థితిలో కొట్టుమిట్టాడుతున్నాడు. ఆసుపత్రి ఆవరణలోని సెప్టిట్ ట్యాంక్ మూత తెరిచి ఉంచడంతో మంగళవారం ఉదయం తొమ్మిదేళ్ల బాలుడు అందులో పడిపోయాడు. అతడి పరిస్థితి విషమించడంతో కరీంనగర్‌లోని ఒక ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. మహబూబాబాద్ జిల్లా కురవి మండలం సూదనపల్లి గ్రామానికి చెందిన శ్రీనివాస్, రాములమ్మ దంపతులు కూలీ పనుల కోసం పెద్దపల్లికి వచ్చారు. సోమవారం శ్రీనివాస్‌కు జ్వరం రావడంతో పెద్దపల్లి ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. వారితో పాటు వారి తొమ్మిదేళ్ల కుమారుడు విలియమ్స్ ఆసుపత్రిలోనే ఉన్నాడు. మంగళవారం ఉదయం టాయిలెట్ కోసం ఆసుపత్రి ఆవరణలోని సెప్టిక్ ట్యాంక్ గల ప్రదేశానికి వెళ్లాడు. ట్యాంక్ మూత తెరిచి ఉండడంతో విలియమ్స్ ప్రమాదవశాత్తు అందులో పడిపోయాడు. ఈ విషయాన్ని గమనించిన తల్లి కేకలు వేయడంతో ఆసుపత్రి సిబ్బంది అక్కడకు చేరుకొని బాలుడిని బయటకు తీశారు. బాలుడి పరిస్థితి విషమంగా ఉండటంతో ప్రథమ చికిత్స అనంతరం కరీంనగర్‌లోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. బాలుడి పరిస్థితి విషమంగా ఉండటంతో కరీంనగర్‌లో వెంటిలేటర్‌పై చికిత్స అందిస్తున్నారు. ఈ విషయమై ఆసుపత్రి సూపరింటెండెంట్ రమాకాంత్‌ను వివరణ కోరగా, సెప్టిక్ ట్యాంకుపై మూత తెరిచి ఉన్న కారణంగానే బాలుడు అందులో పడ్డాడని తెలిపారు. ఈ ఘటనపై విచారణ జరుపుతున్నామని వివరించారు.

ప్రమాదకరంగా బాలుడి పరిస్థితి

సుభాష్‌నగర్: పెద్దపల్లి జిల్లా ఆసుపత్రిలోని సెప్టింక్ ట్యాంకులో పడిన బాలుడు కరీంనగర్‌లోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో ఐసీయూలో చికిత్స పొందుతున్నాడు. ట్యాంకులో పడిన బాలుడిని సకాలంలో గుర్తించక పోవడం, నీళ్ల ఎక్కువగా తాగడం వల్ల ప్రస్తుతం కోమా స్థితిలో ఉన్నాడని, 48 గంటలు గడిస్తే కానీ ఏమీ చెప్పలేమని డాక్టర్లు తెలిపారు.

భారతదేశానికి రక్షణ కవచం ప్రధాని మోదీ

● కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సజయ్ కుమార్



మున్నూరుకాపు భవన నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న బండి సంజయ్

వేములవాడ టౌన్, జూలై 9 : దేశంలో గోకుల్ బాంబు బ్లాస్టులు లేవని, లుంబిని పార్క్‌లాంటి బ్లాస్టులు, టెర్రరిస్టుల అలజడి దేశంలో ఎక్కడ కనబడుతలేవంటే కేవలం ప్రధాని నరేంద్ర మోదీ దేశానికి రక్షణ కవచంలా నిలుస్తున్నాడని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సజయ్ కుమార్ అన్నారు. వేములవాడ పట్టణంలో మున్నూరు కాపు సంఘం భవన నిర్మాణ భూమిపూజ కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా బండి సంజయ్ కుమార్ మాట్లాడుతూ కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గంలోని వేములవాడ, కొండగట్టు, ఇల్లందకుంట ఆలయాలను అభివృద్ధి చేసి తీరుతానని హామీచ్చారు. ఆయా ఆలయాల అభివృద్ధిపై కేంద్ర మంత్రి గజేంద్ర షెకావత్‌ను కలిశామన్నారు. అవసరమైతే కేంద్ర మంత్రిని వేములవాడకు తీసుకు వచ్చేందుకు కృషి చేసి అన్ని విధాల అభివృద్ధి చేస్తానని అన్నారు. మున్నూరు కాపు సంఘం భవన నిర్మాణానికి శంఖుస్థాపన చేయడం సంతోషంగా ఉందని ఆనందం వ్యక్తం చేశారు. మీరంతా కష్టపడి పని చేసినందుకే మంత్రిని అయ్యాయనని, నా గెలుపునకు కాంగ్రెస్, బీఆర్ఎస్ కార్యకర్తలు కూడా సహకరించారని అన్నారు. నాకు భారీ మెజార్టీ అందించిన ఈ ప్రాంత ప్రజల అభివృద్ధి కోసం పని చేస్తానని, స్థానిక ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ సహకారంతో నియోజకవర్గ అభివృద్ధికి పనిచేస్తానని అన్నారు. అనంతరం పట్టణం బీజేపి పార్టీ జిల్లా అధ్యక్షుడు ప్రతాప రామకృష్ణ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కృతజ్ఞత సభకు హాజరయ్యారు. ఈ సందర్భంగా భీమేశ్వర గార్డెన్‌కు విచ్చేసిన ఆయనకు అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం ఏర్పాటు చేసిన సభలో బండి సంజయ్ కుమార్ మాట్లాడుతూ మీరు తయారు చేసిన కార్యకర్తను అని, కింది స్థాయి నుంచి ఎదిగిన వ్యక్తిని అని, కష్టమొచ్చిన కార్యకర్తలకు అండగా ఉంటానని కార్యకర్తలను ఉత్తేజపరిచారు. దేశంలో మోదీ ప్రభుత్వం లేకుంటే 370 ఆర్టికల్ రద్దు చేసే సాహసం ఎవరూ చేసేవాళ్లు కాదన్నారు. మొన్నటి వరకు పార్లమెంట్ చేసే చట్టాలు జమ్మూ కాశ్మీర్‌కు వర్తించేవి కాదని, 370 ఆర్టికల్ రద్దుతో భారతీయ జెండా సగర్వంగా ఎగురుతుందని ఉద్వేగభరితంగా చెప్పారు. అభివృద్ధి, ప్రజా సంక్షేమమే బీజేపీ ధ్యేయం అన్నారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు ప్రతాప రామకృష్ణ, నియోజకవర్గ ఇంచార్జ్ చెన్నమనేని వికాస్‌రావు, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఎర్రం మహేష్, అల్లాడి రమేష్, దళితమోర్చ జాతీయ ప్రధాన కార్యదర్శి కుమ్మరి శంకర్, మాజీ ఎంపీపీ బండ మల్లేశం యాదవ్, నాయకులు రేగుల మల్లికార్జున్, జక్కుల తిరుపతి తదితరులు ఉన్నారు.

ఆలయాల్లో ఘనంగా ఆషాఢమాస పూజలు



మానసాదేవి ఆలయంలో కుంకుమ పూజలు



మెట్‌పల్లి పెద్దమ్మ ఆలయంలో కుంకుమ పూజలు

గన్నేరువరం, జులై 9: మండలంలోని ఖాసింపేట మానసాదేవి ఆలయానికి ఆషాడమాస శోభ సంతరించుకుంది. స్వయంభువుగా వెలసిన మానసాదేవి ఆలయంలో ఆషాడమాసం మొదటి మంగళవారం భక్తులతో కిక్కిరిసిపోయింది. అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి అమ్మవారి ఉత్సవ విగ్రహానికి క్షీరాభిషేకం, కుంకుమ పూజలు చేశారు. కోరిన కోర్కెలు తీర్చాలని ముడుపులు కట్టి, ఒడి బియ్యం పోసి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయకమిటీ ఛైర్మన్ ఏలేటి చంద్రారెడ్డి, ప్రధాన అర్చకులు అమర్‌నాథ్ శర్మ, అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.

● మెట్‌పల్లి: పట్టణంలోని బంగారు పెద్దమ్మ తల్లి ఆలయంలో కల్యాణ కాత్యాయనీ దేవి వ్రతాన్ని ఘనంగా జరిపించారు. మంగళవారం ఆలయంలో బంగారు తల్లి అమ్మవారికి, శ్రీవల్లి దేవి, సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఉత్సవ మూర్తులకు పంచామృతాలతో అభిషేకాలు, లక్ష్మీదేవి పూజలను ఆలయ పురోహితుడు మదన్‌శర్మ జరిపారు. అనంతరం భక్తులు ఆలయం సమీపంలోని శ్రీ ఐశ్వర్యలక్ష్మి గోశాలలోని గోమాతలకు మహిళలు, భక్తులు ప్రత్యేక పూజలు జరిపి వాటికి ఆహారం అందజేసి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా భక్తులకు పురోహితులు తీర్థ ప్రసాదం అందజేశారు.

కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల హామీలను అమలు చేయాలి

గన్నేరువరం, జులై 9: కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ మండల ప్రజాసంఘాల సమన్వయ కమిటీ ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని తహశీల్దారు కార్యాలయంలో తహశీల్దారు భిక్షపతికి మంగళవారం వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ప్రజాసంఘాల కన్వీనర్, గొర్రెలు మేకల పెంపకందారుల సంఘం జిల్లా కార్యదర్శి కాల్వ సురేష్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి సుంకరి సంపత్ మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల మేనిఫెస్టోలో అనేక హామీలను ఇచ్చి అధికారంలోకి వచ్చిందని అన్నారు. హామీలలో భాగంగా మహాలక్ష్మి పథకంలో 18 సంవత్సరాల నుంచి ప్రతి మహిళకు నెలకు 2,500 ఇవ్వాలని అన్నారు. ఖరీఫ్ సీజన్‌లో అన్నదాతకు రైతుభరోసా సాయం 7,500 అందించాలని, వ్యవసాయ కూలీలకు 12000, కౌలు రైతులకు 15000, ప్రతి రైతుకు రెండు లక్షల రుణమాఫీ అందించాలని డిమాండ్ చేశారు. ఇంటి స్థలం లేనివారికి 200 గజాల స్థలాన్ని కేటాయించి ఇంటి నిర్మాణానికి ప్రభుత్వం 5లక్షలను, కేంద్ర ప్రభుత్వం పది లక్షలను ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో గొర్రెలు మేకల పెంపకందారుల సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు జీల ఎల్లయ్య, మండల నాయకులు పాశం వేణు, శ్రీనివాస్, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

దొంగ అరెస్ట్

పెద్దపల్లి టౌన్, జూలై 9 : పెద్దపల్లి జిల్లా కేంద్రంలోని అయ్యప్ప ఆలయంలో మే 28న హుండీ పగులగొట్టి డబ్బులు ఎత్తుకెళ్లిన దొంగను పోలీసులు అరెస్ట్ చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నెన్నెల మండలం, మైలారం గ్రామానికి చెందిన కంపెల శ్రీనివాస్ గతంలో నెన్నల్, రెబ్బనలోని ఆలయాల్లో దొంగతనం చేయగా కేసులు నమోదు కావడంతో ఏడాది కాలం జైలుకు వెళ్లాడు. గత ఐదేళ్లగా పెద్దపల్లి పట్టణంలోని తిలక్‌నగర్‌లో ఉంటూ సెంట్రింగ్ పనిచేసుకుంటూ జీవిస్తున్నాడని అన్నారు. జల్సాలకోసం తిరిగి అయ్యప్ప ఆలయంలో దొంగతనం చేశాడని , అతన్ని సీసీ కెమెరాల ద్వారా గుర్తించి పెద్దపల్లి వద్ద వాహనాలు తనిఖీ చేస్తుండగా దొంగను గుర్తించి అతని వద్ద రూ.4370లను రికవరీ చేసినట్లు తెలిపారు. దొంగను పట్టుకోవడంతో పెద్దపల్లి ఏసీపీ గజ్జి కృష్ణ పెద్దపల్లి ఎస్ఐ లక్ష్మణ్‌రావు, మల్లేశంతో పాటు సిబ్బందిని అభినందించారు.

అలంకారప్రాయంగా క్రీడా ప్రాంగణాలు

● లక్షలు వెచ్చించినా నెరవేరని లక్ష్యం



నిరుపయోగంగా ఉన్న రంగపేట క్రీడాప్రాంగణం

మానకొండూర్, జూలై 9: గ్రామీణ ప్రాంతాల్లో క్రీడలను ప్రోత్సహించి నైపుణ్యం గల క్రీడాకారులను తయారు చేయాలనే ఉద్దేశ్యం లక్షల రూపాయలను వెచ్చించి తెలంగాణ క్రీడా ప్రాంగణాలను నెలకొల్పాడు. గ్రామాల్లోని ప్రభుత్వ స్థలాలతో పాటు ప్రభుత్వ పాఠశాలల్లో క్రీడా ప్రాంగణాలను ఏర్పాటు చేశారు. మండలంలో 27 గ్రామపంచాయితీలుండగా నిజాయితీగూడెంలో స్థలం లేక అక్కడ క్రీడా ప్రాంగణం ఏర్పాటు చేయలేదు. మిగతా 26 గ్రామాలలో ఒక్కొక్క దానికి రూ. 2లక్షల ఎస్టిమేషన్ ఉన్నప్పటికీ లక్ష రూపాయల వరకే చెల్లింపులు జరిగాయి. ఈ క్రీడా ప్రాంగణంలో వాలీబాల్, ఖోఖో, కబడ్డీ కోర్టు, ఆర్చీల నిర్మాణం ఎంతో ఆర్భాటంగా పూర్తి చేశారు. రంగపేట క్రీడా ప్రాంగణం గ్రామానికి సుమారు 4కిలోమీటర్ల దూరంలో యువకులకు ఉపయోగపడకుండా ఉంది. ప్రతి గ్రామానికి 16 రకాల ఆట వస్తువుల కిట్టును అధికారులు పంపిణీ చేశారు. పంపిణీ చేసిన కిట్లు మూలన పడడంతో యువత క్రీడా ప్రాంగణాలను దూరం అయ్యారు. దీంతో క్రీడా ప్రాంగణాలు అలంకార ప్రాయంగా దర్శనమిస్తున్నాయి.

బిల్లులు చెల్లించడం లేదని పంచాయతీ కార్యాలయానికి తాళం



తాళం వేసి ఉన్న రాంసాగర్ పంచాయతీ భవనం

కొడిమ్యాల, జూలై 9 : ప్రభుత్వం నుంచి తనకు రావాల్సిన బిల్లులు చెల్లించడం లేదని జగిత్యాల జిల్లా కొడిమ్యాల మండలంలోని రాంసాగర్ గ్రామ పంచాయతీ భవనానికి కాంట్రాక్టర్ నీలగిరి గంగారావు మంగళవారం తాళం వేశాడు. ఈ సందర్భంగా కాంట్రాక్టర్ మాట్లాడుతూ గ్రామంలో రూ. 20లక్షలతో గ్రామ పంచాయతీ భవనం నిర్మించినట్లు తెలిపాడు. 2024 ఫిబ్రవరిలో భవన నిర్మాణం పూర్తి చేసి అప్పగించానన్నారు. ఇప్పటి వరకు తనకు రావాల్సిన డబ్బులు అందలేదన్నాడు. అధికారులకు ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా ప్రభుత్వం నుంచి వచ్చిన తర్వాత చెల్లిస్తాం అంటున్నారే తప్ప బిల్లులు మాత్రం రావడం లేదని ఆవేదన వ్యక్తం చేశాడు. ఈ కారణంగా కార్యాలయానికి మంగళవారం తాళం వేశానని కాంట్రాక్టర్ గంగారావు తెలిపాడు. ఈ విషయమై ఎంపీవో వాసవిని వివరణ కోరగా ప్రభుత్వం నుంచి బిల్లులు రాకపోవడంతోనే చెల్లింపుల్లో జాప్యం జరుగుతోందని తెలిపారు. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి బిల్లులు త్వరలో చెల్లించేలా చూస్తామని కాంట్రాక్టర్‌కు హామీ ఇవ్వడంతో బుధవారం తాళం తీస్తానని చెప్పారని తెలిపారు.

ఎమ్మెల్యే ఆర్థిక సహాయం

కాల్వశ్రీరాంపూర్, జూలై 9: మండల కేంద్రంలో తుండ్ల రమేష్ ఇటీవల గుండెపోటుతో మృతి చెందాడు. రైతునికి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు, మాజీ ఎంపీపీ గోపగోని సారయ్య గౌడ్ మంగళవారం రూ.5వేల ఆర్థిక సహాయం అందజేశారు.

మొక్కలు నాటిన విద్యార్థులు

కాల్వశ్రీరాంపూర్, జూలై 9:మండలంలోని ఊషన్నపల్లిలో ఇంగ్లీష్ మీడియం ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల విద్యార్థులు మంగళవారం పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు ఈర్ల సమ్మయ్య, ఉపాధ్యాయుడు అమృత, సురేష్ కుమార్, అటెండర్ లింగయ్య, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థులకు బెల్టు పంపిణీ

మంథని, జూలై 9: స్థానిక బాలుర ఉన్నత పాఠశాల విద్యార్థులకు బెల్టు, పెన్నులు, ఇతర ఉపయోగకరమైన వస్తువులను లోకే మనోహర్, లోకే శరత్‌లు మంగళవారం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం శ్రీనివాస్, టక్కేగారి రాధాకృష్ణ, ఉపాధ్యాయులు వనిత, ఉమా, శంకర్, సుమలత, శ్రీనివాస్, శారద, నందు, శ్రీనివాస్, రాజేందర్, అవధానుల మాధురి, రమణ, ఉమాలు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ

మంథని, జూలై 9: మంథనిలో ఇటీవల మృతిచెందిన మంథని వసంతరావు, జంబోజు రాజయ్య, మండలంలోని లక్కెపూర్‌లో కాంగ్రెస్ నాయకుడు మంథని మల్లేష్ కుటుంబాలను మంత్రి శ్రీధర్‌బాబు తరుపున ఆయన సోదరుడు, శ్రీపాద ట్రస్టు చైర్మన్ శ్రీనుబాబు మంగళవారం పరామర్శించారు. వెంట కాంగ్రెస్ పార్టీ నేతలు ఉన్నారు.

కంటి ఆపరేషన్ల కోసం తరలింపు

మంథని, జూలై 9: లయన్స్ క్లబ్-విజన్‌కేర్ వ్యవస్థాపకుడు లయన్ పూదరి దత్తాగౌడ్ ఆధ్వర్యంలో మండలంలోని పలు గ్రామాలకు చెందిన 36మందిని కంటి ఆపరేషన్ల కోసం మంగళవారం కరీంగనర్‌కు తరలించారు. వీరికి ఉచిత ఆపరేషన్లు, రవాణా, భోజన, వసతి కల్పిపిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో శంషీర్, బుద్దార్తి సతీష్, చిదుర సురేష్‌లు పాల్గొన్నారు.

ఉద్యమ గానకోకిల బిరుదుకు ఏట రవి ఎంపిక

మంథని, జూలై 9: ఉత్తర తెలంగాణ పీపుల్స్ మూమెంట్ సంస్థ ప్రజా గాయకుడు ఏట రవిని ఉద్యమ గానకోకిల బిరుదుకు ఎంపిక చేసింది. ఈనెల 12న కరీంనగర్ ప్రెస్ భవన్‌లో జరిగే కార్యక్రమంలో సంస్థ రవికి బిరుదును ప్రదానం చేయనున్నది.

ఘనంగా ఏబీవీపీ ఆవిర్భావ దినోత్సవం

కోల్‌సిటీటౌన్, జూలై 9: ఏబీవీపీ ఆవిర్భావ వేడుకలు మంగళవారం గోదావరిఖనిలో ఘనంగా నిర్వహించారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జరిగిన కార్యక్రమానికి ఏబీవీపీ పెద్దపల్లి జిల్లా కన్వీనర్ బండి రాజశేఖర్ హాజరై మాట్లాడారు. నగర కార్యదర్శి పిడుగు సిద్ధార్థ, నాయకులు ఉదయ్, సందీప్, రవి, మహిళా కార్యకర్తలు భవాని, కావ్య, హిమబిందు, విద్యార్థులు పాల్గొన్నారు.

సుల్తానాబాద్ : అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ ఆవిర్భావ వేడుకలు సుల్తానాబాద్‌లో సంస్థ నాయకులు ఘనంగా జరుపుకున్నారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లా హాస్టల్స్ కమిటీ కన్వీనర్ రాసూరి ప్రవీణ్ ఆధ్వర్యంలో ఏబీవీపీ జెండాను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో రిషి, సిద్దార్థ, వినయ్, నిశాంత్, సిద్దార్థ, సంపత్ పాల్గొన్నారు.

జూలపల్లి : మండల కేంద్రంలో మంగళవారం ఏబివిపి ఆవిర్భావ వేడుకలను నిర్వహించారు. ఈసందర్భంగా ఏబీవీపీ జెండాను ఆవిష్కరించి వందనం చేశారు. సందనవేని ఓమేష్, మారం ఓంప్రకాష్, శ్రావన్, అకిల్, సాగర్, అనీష్, హరిష్, స్వామి పాల్గొన్నారు.

సుల్తానాబాద్‌లో మోస్తరు వర్షం

సుల్తానాబాద్, జూలై 9 : సుల్తానాబాద్ పట్టణంలో మంగళవారం ఉదయం మోస్తరు కురిసింది. కొన్ని రోజులుగా వర్షాలు లేకపోవడంతో ఉదయం కురిసిన వర్షానికి ప్రజలు ముఖ్యంగా రైతులు ఉపశమనం చెందారు. అయితే ఈ వర్షం గంటలోపు మాత్రమే కురువడంతో రైతులు కొంత నిరాశకు గురయ్యారు. నాట్లు వేసే సీజన్ కావడంతో రైతులు వర్షాల కోసం ఎదురుచేస్తున్నారు.

అత్యాధునిక పద్ధతిలో రైతులకు సలహాలు

- 'రైతు నేస్తం'పై విస్తృత ప్రచారానికి ప్రభుత్వం సన్నాహాలు - రాఘవపూర్ రైతు వేదికకు వీడియో కాన్ఫరెన్స్ యూనిట్



రాఘవపూర్ రైతు వేదికకు చేరిన వీడియో కాన్ఫరెన్స్ యూనిట్

పెద్దపల్లి రూరల్, జూలై 9 : రైతు వేదికలో సలహాలుసూచనలు అందించేందుకు 'రైతు నేస్తం' అనే కార్యక్రమాన్ని ప్రతి మంగళవారం నిర్వహిస్తోంది. ఈ కార్యక్రమాన్ని విస్తృత పరచాలని ప్రభుత్వం నిర్ణయించింది. మండలానికి ఒకటి చొప్పున రైతు వేదికల్లో వీడియో కాన్ఫరెన్స్ యూనిట్‌లను మంజూరుచేసింది. పెద్దపల్లి మండలంలో రాఘవపూర్, బ్రాహ్మణపల్లి, కొత్తపల్లి, చీకురాయి, పాలితం, రాంపల్లిలో రైతు వేదికలు ఉండగా, మొదటి విడతగా రాఘవపూర్‌లో కార్యక్రమాన్ని చేపట్టేందుకు వీడియో కాన్ఫరెన్స్ యూనిట్ పరికరాలను సరఫరా చేసింది. అప్పట్లో ప్రయోగాత్మకంగా నియోజకవర్గానికి ఓ రైతు వేదికకు మాత్రమే వీడియో కాన్ఫరెన్స్ సదుపాయం కల్పించి అధికారులు అవగాహన కార్యక్రమాలు నిర్వహించేవారు. మరికొద్ది రోజుల్లో కార్యక్రమాన్ని ప్రారంభించేందుకు వ్యవసాయాధికారులు కసరత్తు చేస్తున్నారు.

● రైతులకు ఎంతో మేలు..

- అలివేణి, మండల వ్యవసాయాధికారిణి, పెద్దపల్లి

ప్రస్తుతం రైతు వేదికలో ఏర్పాటుచేస్తున్న ఆధునిక సాంకేతిక వ్యవస్థ ద్వారా రైతులకు మేలు చేకూరనుంది. రైతులు ఎప్పటికప్పుడు ప్రతి మంగళవారం నిర్వహించే రైతు నేస్తం ద్వారా వీడియో కాన్ఫరెన్స్‌లో పంట సాగులో మెలకువల గురించి తెలుసుకునే అవకాశముంటుంది. తద్వారా వ్యవసాయంతో పాటు ఉద్యాన, పట్టు, మత్స్య, పశుసంవర్ధక, విద్యుత్, నీటిపారుదల శాఖలకు సంబంధించిన సమాచారం తెలుసుకునే వీలుంటుంది. త్వరలో అందుబాటులోకి రానుంది.

గౌరీగుండాల జలపాతాన్ని పిక్నిక్ స్పాట్‌గా తీర్చిదిద్దుతాం

- పెద్దపల్లి ఎమ్మెల్యే విజయరమణారావు

పెద్దపల్లి రూరల్, జూలై 9 : మండలంలోని సబ్బితం గ్రామపంచాయతీ పరిధి గౌరీగుండాల జలపాతాన్ని పిక్నిక్ స్పాట్‌గా తీర్చిదిద్దుతామని పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు అన్నారు. మంగళవారం సబ్బితం గౌరీ గుండాల జలపాతాన్ని పెద్దపల్లి తహసీల్దార్ రాజ్‌కుమార్, స్థానిక మాజీ ప్రజాప్రతినిధులతో కలిసి సందర్శించారు. జలపాతాన్ని ప్రజలు సందర్శించేందుకు వెళ్లడానికి రోడ్డు సదుపాయం, వాటర్‌ఫాల్స్ వద్ద ఇతర సదుపాయాల ఏర్పాటుకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, పర్యాటక శాఖ మంత్రితో మాట్లాడి నిధులు మంజూరు చేయిస్తానని హామీ ఇచ్చారు. జలపాతం పరిసర ప్రాంతాల వద్ద చేపట్టాల్సిన చర్యలపై అధికారులకు తగు సూచనలు చేశారు. జలపాతం ఆవరణలోని ప్రభుత్వ భూమి, పర్యాటక కేంద్రం వరకు రహదారి విస్తరణకు అయ్యే ఖర్చుపై నివేదికలు సమర్పించాలని ఎమ్మెల్యే అధికారులను ఆదేశించారు. సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి శ్రీధర్‌బాబు సహకారంతో జలపాతం ప్రాంతాన్ని అభివృద్ధి చేసేందుకు కృషి చేయనున్నట్లు పేర్కొన్నారు.


గౌరీగుండాల జలపాతాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే విజయరమణరావు

ఈ సందర్భంగా వన మహోత్సవంలో భాగంగా జలపాతం పరిసర ప్రాంతంలో మొక్కలు నాటారు. జలపాతం వద్ద గ్రామస్థులతో సెల్ఫీ దిగారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు బండారి రాంమూర్తి, నూగిల్ల మల్లయ్య, బూతగడ్డ సంపత్, సంద నవీన రాజేందర్, మస్రత్, కట్కూరి సుధాకర్ రెడ్డి, ఆరె సంతోష్, కలబోయిన మహేందర్, గంట రమేష్, ప్రదీప్, చంద శంకర్, చుంచు సదయ్య, పెద్దులు, గుమ్మడి ప్రసాద్, కందుల అశోక్, కొయ్యడ సతీష్, కొయ్యడ సారయ్యగౌడ్, శ్రీకాంత్, ప్రభుత్వ అధికారులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎన్నికల హామీలు అమలుచేయాలని బీజేపీ ఆందోళనలు


సుల్తానాబాద్ తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న బీజేపీ నాయకులు


పెద్దపల్లి తహసీల్దార్‌కు వినతిపత్రం అందిస్తున్న బీజేపీ నాయకులు

సుల్తానాబాద్, జూలై 9: గత అసెంబ్లీ ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ హామీలు ఇచ్చి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసి వాటి అమలు గాలికి వదిలిందని, కమిటీలతో కాలయాపన చేస్తుందని బీజేపీ, కిసాన్ మోర్చా నాయకులు విమర్శించారు. మంగళవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ మధుసుదన్‌రెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో పట్టణ బీజేపీ అధ్యక్షుడు కూకట్ల నాగరాజు, మహిళా మోర్చా జిల్లా ఉపాధ్యక్షురాలు ఎస్ఎన్‌సీ వనజ, మాటూరి లత, బీజేపీ ఉపాధ్యక్షుడు ఎనగందుల సతీష్, తిరుపతి, ఈశ్వర్, చిట్టవేని సదయ్య, బుర్ర సతీష్ గౌడ్, కొల్లూరి సంతోష్, శేఖర్, కిరణ్, రామస్వామి శంకరయ్య కొమురయ్య పాల్గొన్నారు.

పెద్దపల్లి రూరల్, జూలై 9 : ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ రైతులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని మంగళవారం బీజేపీ ఆధ్వర్యంలో మంగళవారం పెద్దపల్లి తహసీల్దార్ కార్యాలయంలో వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో బీజేపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు శిలారపు పర్వతాలు, అసెంబ్లీ కన్వీనర్ దాడి సంతోష్, పెద్దపల్లి మండల అధ్యక్షుడు మేకల శ్రీనివాస్, పట్టణ అధ్యక్షుడు కావేటి రాజగోపాల్, నాయకులు తంగెడ రాజేశ్వర్‌రావు, పోల్సాని సంపత్‌రావు, ఒళ్లే తిరుపతి, ఎర్రోళ్ల శ్రీకాంత్, వేల్పుల రమేష్, పడాల శ్రీనివాస్, గుడ్ల సతీష్, పెంజర్ల రాకేష్, వంశీ, సతీష్, వినయ్ పాల్గొన్నారు.

జూలపల్లి, జూలై 9 : గత ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ పార్టీ రైతులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని బీజేపీ మండల అధ్యక్షుడు కొప్పుల మహేష్ డిమాండ్ చేశారు. బీజేపీ నాయకులతో కలిసి ఆయన మంగళవారం తహసీల్దార్ బషీరొద్దిన్‌కు రైతుల పక్షాన రైతు భరోసాను అమలు చేయాలని కోరుతూ వినతిపత్రం అందజేశారు. లక్కాకుల రమేష్, సంగెం వేణు, ఆవుల రాజు, మల్లెత్తుల ఆంజనేయులు, దావా సంపత్‌రెడ్డి, భూసారపు రవిందర్ గౌడ్, మోహన్‌రెడ్డి, కోడూరి రాజు, గరవేని అజయ్, నగునూరి సురేష్, శ్రీను పలువురు పాల్గొన్నారు.

పాడి పంటలతో గ్రామాలు సుభిక్షంగా ఉండాలి

-ఎమ్మెల్యే విజయరమణారావు


శీత్లా భవాని వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే విజయరమణారావు

ఓదెల, జూలై 9 : గ్రామాలు పాడి పంటలతో కళకళలాడుతూ సుభిక్షంగా ఉండాలని ఎమ్మెల్యే చింతకుంట విజయరమణరావు అన్నారు. లంబాడి తండాలో గిరిజనుల ఆరాధ్యదైవమైన శీత్లా భవాని వేడుకలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. దీనికి ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు, బీఆర్ఎస్ నాయకురాలు దాసరి ఉష వేర్వేరుగా హాజరయ్యారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రతి ఏడాది వానా కాలం ప్రారంభంలో విత్తనాలు వేసిన తరువాత గిరిజనులు శీత్లా భవానిని ఆరాధించడం, వన భోజనాలను నిర్వహించడం ఆనవాయితీగా వస్తుందని తెలిపారు. అంతకుముందు గిరిజనులతో తండా నుంచి శివారులో ఉన్న శీత్లా భవాని వన దేవత వరకు గిరిజన సాంప్రదాయ నృత్యాలతో తరలివెళ్లి నైవేద్యాన్ని సమర్పించారు. ఈ కార్యక్రమంలో సింగిల్‌విండో చైర్మన్ ఆళ్ల సుమన్‌రెడ్డి, భైరి రవిందర్, వస్రం నాయక్, నిమ్మ గుగులోత్ పరశురాం, దేవిలాల్, రాజేశంలతో పాటు గిరిజన పెద్దలు పాల్గొన్నారు.

కరపత్రాల ఆవిష్కరణ

పెద్దపల్లి టౌన్, జూలై 9: ఈనెల 10న చేపట్టనున్న డిమాండ్స్ డే కరపత్రాన్ని మంగళవారం పెద్దపల్లి జూనియర్ కాలేజీ గ్రౌండ్ ఆవరణలో సీఐటీయూ నాయకులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సీఐటీయూ పెద్దపల్లి మున్సిపల్ కార్యదర్శి బొంకురి సాగర్ మాట్లాడుతూ మున్సిపల్ కార్మికులను పర్మినెంట్ చేయాలన్నారు. వేతనాలకు ప్రభుత్వం ప్రత్యేక బడ్జెట్ కేటాయించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అలాగే కనీస వేతనం 26 వేలు అమలు చేయాలన్నారు. మున్సిపాలిటీల్లో పనిచేస్తున్న కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించి వారి సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు సుద్దాల సతీష్, చింతల మరియా తదితరులు పాల్గొన్నారు.

మాజీ ప్రజా ప్రతినిధులకు ఆత్మీయ సన్మానం

పాలకుర్తి, జూలై 9: పదవీకాలం ముగిసిన పాలకుర్తి మాజీ ఎంపీపీ గంగాధరి రమేష్ గౌడ్, మాజీ వైస్ ఎంపీపీ ఎర్రం స్వామితో పాటు మండల పరిధిలోని మాజీ ఎంపీటీసీలను మంగళవారం మండల కేంద్రంలోని రైతు వేదిక ఆవరణలో ఘనంగా సన్మానించి జ్ఞాపికలను అందించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాజీ ప్రజా ప్రతినిధుల సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ కందుల సంధ్యరాణి, ఎంపీవో షబ్బీర్‌పాషా, ఎంపీడీవో కార్యాలయ సిబ్బంది, పలు గ్రామాల పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

విద్యార్థులకు మెరుగైన వసతుల కల్పన


మాట్లాడుతున్న ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్

పాలకుర్తి, జూలై 9: విద్యార్థులకు నాణ్యమైన విద్య, భోజనం, మెరుగైన వసతులు కల్పించడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని రామగుండం ఎమ్మెల్యే రాజ్‌ఠాకూర్ మక్కాన్‌సింగ్ అన్నారు. మంగళవారం మండలం పరిధిలోని జయ్యారంలో ప్రభుత్వ సాంఘిక సంక్షేమ బాలుర వసతిగృహాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థుల సంక్షేమానికి అధిక ప్రాధాన్యం ఇస్తున్నదన్నారు. వసతిగృహ విద్యార్థులను సమస్యలను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థుల సౌకర్యం కోసం తన స్వంత నిధులతో మరో అదనపు గదిని త్వరలో నిర్మిస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో పోల్సాని శశికళ, మాజీ ఎంపీపీ గంగాధరి రమేష్‌గౌడ్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ముక్కెర శ్రీనివాస్‌గౌడ్, మాజీ సర్పంచ్ పర్శవేణి శ్రీనివాస్, మాజీ ఎంపీటీసీ పాత భాగ్యలక్ష్మి రవిందర్, నాయకులు భూషణవేని తిరుపతి, కొప్పు ప్రసాద్, తోట ప్రశాంత్, మాదాసు శ్రావణ్, వార్డెన్ మెండే సంపత్ పాల్గొన్నారు.

ఎరువుల షాపుల తనిఖీ

ఎలిగేడు, జూలై9: ఎలిగేడు, ధూళికట్ట ఎరువుల షాపులను మంగళవారం మండల వ్యవసాయ శాఖ అధికారి ఉమాపతి ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించారు. షాపుల్లో నిల్వ ఉంచిన ఎరువులు వాటి విక్రయాలను తెలుసుకున్నారు. ఈపాస్ మిషన్ ద్వారా ఎరువుల క్రయ విక్రయాలను నమోదు చేయాలని నిర్వాహకులను ఆదేశించారు. స్టాక్ రిజిష్టర్లు, బిల్‌బుక్కులు ప్రతిరోజు నిర్వహించాలన్నారు. రైతులను కలిసి పంట వివరాలను నమోదు చేసుకున్నారు. కార్యక్రమంలో ఏఈవో పద్మ, గణేష్, ఆయా గ్రామాల రైతులు పాల్గొన్నారు.

ఎస్సారెస్పీ ఉప కాలువ గట్టు చదును

ఎలిగేడు, జూలై 9: మండలంలోని ధూళికట్ట, ర్యాకల్‌దేవుపల్లి శివారు గుండా వెళ్తున్న ఎస్సారెస్పీ ఉప కాలువ గట్టును కబ్జా చేసి చదును చేసి పత్తి పంట సాగు చేస్తున్నారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఎస్సారెస్పీ ఉప కాలువ ఇరువైపులా 45పీట్ల భూమిని కేటాయించారు. దానిగుండా కాలువ మరమ్మతుల సమయంలో వాహనాలు, రైతుల సహాయార్థం ట్రాక్టర్లు, ఎడ్ల బండ్లు కూలీలు వెళ్లడానికి వినియోగించే దారిని ఓరైతు సాగు చేశాడు. సమాచారం అందుకున్న అధికారులు వెళ్లి విచారణ చేసి ఎస్సారెస్పీ కాలువ భూమిని వదిలి పెట్టాలని ఆదేశించారు.

బ్యాడ్మింటన్, క్రికెట్ ఫైనల్స్‌లో రామగుండం

జ్యోతినగర్, జూలై 9 : ఎన్టీపీసీలో జరుగుతున్న దక్షిణ రీజియన్ స్పోర్ట్స్ మీట్‌లో రామగుండం ఎన్టీపీసీ క్రికెట్, బ్యాడ్మింటన్‌లో ఫైనల్‌కు చేరుకుంది. ఎన్టీపీసీ మహాత్మాగాంధీ స్టేడియంలో జరుగుతున్న క్రికెట్ లీగ్ మ్యాచుల్లో రామగుండం ఎన్టీపీసీ జట్టు నాలుగు మ్యాచుల్లో గెలిచి ఫైనల్‌కు చేరుకుంది. బుధవారం జరిగే ఫైనల్ పోటీలో రామగుండం, సింహాద్రి ఎన్టీపీసీ జట్లు పాల్గొననున్నాయి. స్పందన ఇండోర్ స్టేడియంలో జరుగుతున్న మహిళల బ్యాడ్మింటన్ పోటీల్లో రామగుండం జట్టు సింగిల్స్, డబుల్స్ లీగ్ పోటీల్లో విజయం సాధించి ఫైనల్‌కు చేరుకుంది. బుధవారం రామగుండం మహిళల జట్టు సింహాద్రి ఎన్టీపీసీతో తలపడుతుంది. ఎన్టీపీసీ సదరన్ స్పోర్ట్స్ మీట్ బుధవారం ముగియనున్నది.

సీఎం రేవంత్‌రెడ్డిని కలిసిన జనక్ ప్రసాద్

గోదావరిఖని, జూలై 9: రాష్ట్ర మినిమమ్ వేజెస్ బోర్డు చైర్మన్‌గా నియమితులైన సింగరేణి కోల్‌మైన్స్ లేబర్ యూనియన్ (ఐఎన్‌టీయూసీ) సెక్రెటరీ జనరల్ జనక్ ప్రసాద్ మంగళవారం సీఎం రేవంత్‌రెడ్డిని కలిశారు. చైర్మన్‌గా నియమితులైన జనక్ ప్రసాద్ ముఖ్యమంత్రిని సన్మానించి కృతజ్ఞతలు తెలిపారు.


సీఎం రేవంత్‌రెడ్డికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న జనక్ ప్రసాద్

ట్రిపుల్ ఐటీకి విద్యార్థి ఎంపిక

పెద్దపల్లి రూరల్, జూలై 9 : మండలంలోని బ్రాహ్మణపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పదవ తరగతి చదివిన విద్యార్థి బాసర ట్రిపుల్ ఐటీకి ఎంపికైంది. 2024-25 విద్యాసంవత్సరానికి బాసర ట్రిపుల్ ఐటీలో ఒడుసుల రేఖ సీటు సాధించింది.విద్యార్థిని పాఠశాల హెచ్ఎం, ఉపాధ్యాయులు, అమ్మ ఆదర్శ కమిటి సభ్యులు మంగళవారం అభినందించి శుభాకాంక్షలు తెలిపారు.



కార్డుల పేరిట వేధించడం మానుకోవాలి

- ఏఐటీయూసీ డిప్యూటీ జనరల్ సెక్రెటరీ వైవీ రావు


మేనేజర్‌కు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

యైటింక్లయిన్‌కాలనీ, జూలై 9: కొత్త కొత్త నిబంధనల పేరిట కార్మికులను వేధించడం మానుకోవాలని ఏఐటీయూసీ డిప్యూటీ జనరల్ సెక్రెటరీ వైవీ రావు సింగరేణి యాజమాన్యానికి సూచించారు. ఎల్లో కార్డు, రెడ్ కార్డుల జారీలపై తెచ్చిన సర్క్యులర్‌ను రద్దుచేయాలని కోరుతూ మంగళవారం ఓసీపీ-1 మేనేజర్‌కు యూనియన్ ఆధ్వర్యంలో వినతిపత్రాన్ని అందజేశారు. ఈసందర్భంగా వైవీ రావు మాట్లాడారు. సేఫ్టీ మెరుగు పరిచేందుకు తీసుకువచ్చిన నిబంధనలు అని చెప్పి అమలుచేస్తున్న కార్డుల జారీ విధానం అనాలోచిత నిర్ణయమని అన్నారు. అధికారులు సరైన పని స్థలాలు అందుబాటులో తేకున్నా, అవసరమైన యంత్రాలను, మ్యాన్‌పవర్ ఇవ్వకున్నా దానికి కార్మికుడిని బాధ్యుడిగా చేస్తు హెచ్చరిక చేయడం సమంజసం కాదని అన్నారు. యాజమాన్యం తీసుకున్న ఈనిర్ణయం ఉత్పత్తిపై ప్రభావం చూపే విధంగా ఉన్నదని, లోపభూయిష్టంగా ఉన్న ఈవిధానంపై సమీక్షించి రద్దు చేయాల్సిన అవసరం ఉన్నదని వైవీ రావు అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో జూపాక రాంచందర్, డీటీ రావు, గంగాధర్, సాంబయ్య, ఏవీఎన్ రెడ్డి, మల్లేష్, శ్రీనివాస్, సంజీవ్, నక్క రమేష్ తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల ఆరోగ్య పరిరక్షణే ధ్యేయం

- ఆర్జీ-3 జీఎం సుధాకర్‌రావు

రామగిరి, జూలై 9: కార్మికుల ఆరోగ్య పరిరక్షణే సింగరేణి ధ్యేయంగా భావిస్తోందని ఆర్జీ-3 జీఎం సుధాకర్‌రావు అన్నారు. మంగళవారం సింగరేణి సంస్థ ఆర్జీ-3 డివిజన్ పరిధిలోని ఓసీపీ-2లో ఒప్పంద ఉద్యోగులకు గుండె పని తీరు, సంబంధిత వ్యాధుల నిర్ధారణకు ఏర్పాటు చేసిన కార్డియాక్‌స్క్రీనింగ్ క్యాంపును జీఎం ప్రారంభించారు. ఈసందర్భంగా జీఎం మాట్లాడుతూ ప్రస్తుతం ఆహారపు అలవాట్ల కారణంగా వచ్చే అనారోగ్య సమస్యలను ముందుగా గుర్తించి వైద్యం చేయించుకునేందుకు వీలుగా క్యాంప్‌ను ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. మూడు రోజుల పాటు స్క్రీనింగ్ శిబిరంలో గుండె సంబంధిత పరీక్షలు చేయించుకోవాలని జీఎం సూచించారు. ఈ కార్యక్రమంలో అధికారులు రఘుపతి, వెంకటరమణ, రాజేందర్, నాగరాజు, మారుతీ, రామారావు, మెడికల్ అధికారులు కళ్యాణ్‌చక్రవర్తి, పద్మ, నాయకులు కొట రవీందర్‌రెడ్డి, ఎంఆర్‌సీ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సంస్థ పరిరక్షణకు ఐక్య ఉద్యమాలు : కార్మిక సంఘాల జేఏసీ

యైటింక్లయిన్‌కాలనీ, జూలై 9: సింగరేణిని కాపాడుకునేందుకు ఐక్య ఉద్యమాలు చేపట్టనున్నట్లు సింగరేణి కార్మిక సంఘాల జేఏసీ నాయకులు పేర్కొన్నారు. మంగళవారం స్థానిక ప్రెస్‌భవన్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. బొగ్గు బ్లాక్‌ల వేలంకు వ్యతిరేకంగా హెచ్ఎంఎస్, ఐఎఫ్‌టీయూ, ఏఐఎఫ్‌టీయూ, టీఎన్‌టీయూసీ, తెలంగాణ ఉద్యోగులు సంఘం సమష్టిగా పోరాటాలకు నిర్ణయించినట్లు తెలిపారు. గతనెల 21న వేలంపై హైదరాబాద్‌లో జరిగిన సమీక్షా సమావేశానికి డిప్యూటీ సీఎం హాజరుకావడం బాధాకరమైన విషయమన్నారు. వేలాన్ని అడ్డుకోవాల్సిన కాంగ్రెస్ పార్టీ బాధ్యతను విస్మరించినట్లు నాయకులు పేర్కొన్నారు. వేలంద్వారా ప్రైవేట్ సంస్థలకు గనులు కట్టబెట్టడం కేవలం సింగరేణి సమస్య కాదని, ఇక్కడి నిరుద్యోగ, ఆదివాసీల, భూనిర్వాసిత, ప్రభావిత గ్రామాల సమస్య అని పేర్కొన్నారు. గనుల వేలాన్ని అడ్డుకోడానికి దశల వారి పోరాటాలు చేయాలని నిర్ణయం తీసుకున్నట్లు జేఏసీ నాయకులు తెలిపారు. ఈనెల 11 నుంచి 24 వరకు జీఎం ఆఫీస్‌ల ఎదుట ధర్నాలు, 29న కొత్తగూడెం హెడాఫీస్ ఎదుట ఒకరోజు నిరాహార దీక్ష చేయనున్నట్లు నాయకులు తెలిపారు. ఈ విలేకరుల సమావేశంలో రియాజ్ అహ్మద్, ఐ కృష్ణ, రాములు, నరేష్, దావు రమేష్, ఈ రాజేందర్, అశోక్, మల్లయ్య, పోచమల్లు, ప్రసాద్, మల్లేష్ పాల్గొన్నారు.


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న రియాజ్ అహ్మద్

కొనసాగిన ఏఐటీయూసీ రిలే నిరాహార దీక్ష

యైటింక్లయిన్‌కాలనీ, జూలై 9:బొగ్గు గనుల వేలాన్ని వ్యతిరేకిస్తూ ఏఐటీయూసీ ఆధ్వర్యంలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలో భాగంగా ఆర్జీ-2 జీఎంఆఫీస్ ఎదుట యూనియన్ శ్రేణులు మంగళవారం రెండవ రోజు నిరాహార దీక్ష చేశారు. ఈసందర్భంగా యూనియన్ అధ్యక్షుడు సీతారామయ్య మాట్లాడారు. స్వాతంత్రానికి పూర్వం నుంచి ప్రభుత్వరంగ స్థంగా బొగ్గు రంగంలో ఉన్న సింగరేణి గోదావరి పరివాహక ప్రాంతంలో బొగ్గు వెలికితీస్తూ దేశానికి వెలుగులను అందిస్తున్నదని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు కోట్లాది రూపాయలు పన్నుల రూపంలో చెల్లిస్తున్నట్లు తెలిపారు. 2015లో ఎన్‌డీఏ ప్రభుత్వం ఎంఎండీఆర్ చట్టం అమలులోకి తెచ్చి బొగ్గు గనులను వేలం ద్వారా కేటాయిస్తున్నదని, వేలం జాబితాలో రాష్ట్రంలోని నాలుగు గనులు ఉన్నట్టు సీతారామయ్య పేర్కొన్నారు. సోమవారం కేంద్ర బొగ్గు శాఖా మంత్రి కిషన్‌రెడ్డిని కలిసి నాలుగు బ్లాక్‌లను సింగరేణికి కేటాయించాలని కోరామని, కేంద్రం దిగిరాకుంటే అన్ని కార్మిక సంఘాలను కలుపుకుని ఐక్య పోరాటాలకు ఏఐటీయూసీ సిద్ధమని సీతారామయ్య అన్నారు. కార్మిక వర్గం యూనియన్ చేసే పోరాటాలకు మద్దతుగా నిలవాలని కోరారు. ఈ నిరాహార దీక్షలో ప్రకాష్, వైవీ రావు, రాజారత్నం, జీ రవీందర్, అన్నారావు, బుర్ర తిరుపతి, సాంబశివరావు, రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

రామగిరి, జూలై 9: సింగరేణి బొగ్గు బ్లాక్‌ల వేలం రద్దు చేయాలనే ప్రధాన డిమాండ్‌పై ఏఐటీయుసీ చేపడుతున్న రిలే నిరాహారదీక్ష మంగళవారంతో రెండో రోజు చేరుకుంది. జీఎం కార్యాలయం ఎదుట చేపడుతున్న దీక్ష శిబిరాన్ని ఏఐటీయూసీ అధ్యక్షుడు సీతారామయ్య సందర్శించారు. దీక్షలో పాల్గోనే కార్మిక నేతలకు కండువాలు కప్పి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో నాయకులు వై.వీరావు, జూపాక రాంచందర్, ఎంఆర్సీరెడ్డి, కందికట్ల సమ్మయ్య, డీటీ రావు, గంగాధర్, వెంకటస్వామి, బ్రాంచ్, పిట్ కమిటీ నాయకులు పాల్గొన్నారు.

గోదావరిఖని, జూలై 9: బొగ్గు బ్లాకులను సింగరేణికే కేటాయించాలని డిమాండ్ చేస్తూ ఏఐటీయూసీ ఆధ్వర్యంలో ఆర్‌జీ-1 జీఎం కార్యాలయం ఎదుట చేపట్టిన నిరసన దీక్షలు మంగళవారం రెండవ రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా ఏఐటీయూసీ ఉప ప్రధాన కార్యదర్శి మడ్డి ఎల్లయ్య మాట్లాడుతూ 3వ సారి అధికారంలోకి వచ్చిన బీజేపీ కార్మిక వ్యతిరేక విధానాలను అవలంభిస్తుందని, నూతన బొగ్గు గనులను ప్రభుత్వరంగ సంస్థ అయిన సింగరేణికి ఇవ్వకుండా ప్రైవేట్ వ్యక్తులకు వేలం ద్వారా ఇచ్చేందుకు నిర్ణయం తీసుకుందని, దీన్ని ఏఐటీయూసీ ఏఐటీయూసీ తీవ్రంగా ఖండిస్తున్నట్టు చెప్పారు. మంగళవారం జీడీకే 2 ఇంక్లైన్ బొగ్గుగని కార్మికులకు నిరాహార దీక్ష చేపట్టారు.

రెండు రోజులుగా ఆర్‌జీ-1 జీఎం కార్యాలయం ఎదుట ఏఐటీయూసీ ఆధ్వర్యంలో చేపట్టిన రిలే నిరాహార దీక్ష శిబిరాన్ని ఏఐటీయూసీ అధ్యక్షుడు సీతారామయ్య సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బొగ్గు బ్లాకులను సింగరేణికే కేటాయించాలని కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి కిషన్‌రెడ్డితో జరిగిన చర్చల్లో మంత్రి సానుకూలంగా స్పందించారని, బొగ్గు బ్లాకులను వేలం వేయకుండా సింగరేణికే కేటాయించాలని కోరినట్టు చెప్పారు. గత ప్రభుత్వాల విధానాల వల్లే ఆర్థిక దోపిడీ జరిగిందని, ఎంఎండీఆర్ చట్టంలో మార్పు చేయడం జరిగిందన్నారు. ఈ దీక్షల్లో ఏఐటీయూసీ, సీపీఐ నాయకులు ఆరెల్లి పోషం, రంగు శ్రీనివాస్, ఎంఎ గౌస్, మద్దెల దినేష్, రాజబాబు, లక్ష్మీనారాయణ, దాసరి శ్రీనివాస్, చెప్యాల మహేందర్‌రావు, వెంకటేశ్వర్లు, తొడుపునూరి రమేష్, రేణికుంట్ల ప్రీతం, జగదీశ్వర్, కనకరాజు తదితరులు పాల్గొన్నారు.

ఓసీపీ-2లో వన మహోత్సవం

రామగిరి, జూలై 9: సింగరేణి సంస్థ ఆర్జీ-3 డివిజన్ పరిధిలోని ఓసీపీ-2లో మంగళవారం వనమహోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రాజెక్టు ఓబీ కుప్పలపై మొక్కల నాటే కార్యక్రమానికి ఆర్జీ-3 జీఎం సుధాకర్‌రావు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ప్రతి ఒక్కరు మొక్కలు నాటి వాటి సంరక్షణ బాధ్యతలు చేపట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అధికారులు రఘుపతి, వెంకటరమణ, బానోత్‌కర్ణ, రాజారెడ్డి, చంద్రశేఖర్, మారుతీ, రామారావు, నాగరాజు, నాయకులు కొట రవీందర్ రెడ్డి, ఎంఆర్‌సీ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


మొక్కలు నాటుతున్న జీఎం సుధాకర్‌రావు